## కూలిన వంతెన..



ఇంద్రాయణి నది ప్రమాద ఘటనలో ఇద్దరి మృతి 2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - సోమవారం 16 జూన్ 2025 | సంపుటి:9 | సంచిక:170 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు..



ఉరుములు, మెరుపులతో జోరు వానలు! ఎల్లో అలర్ట్ జారీ 2



# సైప్రస్‌లో మోడీ

**ఢిల్లీ, జూన్ 15:** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఆదివారం ద్వీప దేశమైన సైప్రస్‌కు చేరుకున్నారు. దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. 23 ఏండ్ల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్ ల పర్యటించడం ఇదే మొదటిసారి. ఇందులో భాగంగా ఆ దేశాధ్యక్షుడితో మోడీ సమావేశం కానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్ టెర్రరిజం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకునే దిశగా చర్చలు ...మిగతా 2లో

# ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై
# జీఎస్టీ తగ్గించండి
## పీయూష్ గోయల్‌ను కోరిన చంద్రబాబు



**అమరావతి:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ ముగిసింది. రాష్ట్రంలోని వివిధ అంశాలపై సీఎం, కేంద్రమంత్రి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీ తగ్గింపుపై ఇరువురు నేతలు చర్చించారు. పొగాకు ధరలు తగ్గినందున రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సీఎం వివరించారు.పొగాకు కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు ఖర్చు చేస్తోందని, టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలన్నారు. పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్‌ను టొబాకో బోర్డు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంతో భేటీ అనంతరం పీయూష్ గోయల్ గుంటూరు వెళ్లారు. గుంటూరు పొగాకుబోర్డ్ కార్యాలయంలో అధికారులు, ఎన్ఐసీడీసీతో సమావేశం నిర్వహించనున్నారు. పొగాకు కొనుగోళ్లు, రైతుల సమస్యలపై చర్చించనున్నారు.

### నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీఎం అభినందనలు

నీట్ (యూజీ -2025)లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అద్భుతంగా రాణించారన్నారు. దేశవ్యాప్తంగా 18వ ర్యాంకు సాధించిన తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్‌సాయి కుమార్, 19వ ర్యాంకు సాధించిన ఏపీకి చెందిన దర్భా కార్తీక్‌రామ్‌లకు అభినందనలు తెలిపారు. "మీ కృషి ఫలించింది, వైద్య వృత్తి కలను నెరవేర్చుకోవాలనుకునే ఆశావహులందరికీ ప్రేరణగా నిలుస్తుంది"అని వ్యాఖ్యానించారు.

### యోగాను జీవితంలో భాగం చేసుకుందాం

ప్రపంచానికి భారత దేశం ప్రసాదించిన దివ్య వరం యోగా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఆరోగ్యాన్నే కాకుండా ఆయుష్షును పెంచే యోగా మన జీవన విధానం కావాలి. ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నాం.

### ఆస్ట్రేలియా పోలీసుల దౌర్జన్యం
# భారత సంతతి వ్యక్తి మృతి
## జార్జి ఫ్లాయిడ్ ఉదంతాన్ని తలపిస్తున్న దుర్మార్గం



**ఆడిలైడ్, జూన్ 15:** ఆస్ట్రేలియాలోని అడిలైడ్లో భారత సంతతికి చెందిన గౌరవ్ కుండి అనే యువకుడిపై అక్కడి పోలీసులు ఇటీవల కర్కశంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన గౌరవ్.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అడిలైడ్లో ఉండే గౌరవ్ కుండి, అమృత్ పాల్ కౌర్ దంపతుల మధ్య ఇటీవల చిన్న వాగ్వాదం చోటుచేసుకుంది. అది గమనించిన పెట్రోలింగ్ పోలీసులు.. గృహ హింసగా భావించారు. అనంతరం ఇంట్లోకి వచ్చి గౌరవ్ ను అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించారు. అయితే, తమ మధ్య ఎలాంటి గొడవ లేదని, ...మిగతా 2లో

# డ్రగ్స్, గంజాయిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం



**విజయవాడ:** కూటమి ప్రభుత్వం డ్రగ్స్ గంజాయిని ఉక్కుపాదంతో అణచివేస్తోందని విజయవాడ తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. డ్రగ్స్ వల్ల ఆ కుటుంబమే కాదు.. సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. నేడు యువత ఎక్కువగా డ్రగ్స్, గంజాయికి బానిసలు కావడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఇస్కాన్ ఆధ్వర్యంలో (ఆదివారం) విజయవాడలో మారథాన్ రన్ నిర్వహించారు. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ఈ మారథాన్ జరిగింది.ఇస్కాన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కోసం వాక్‌థాన్ ఏర్పాటు చేశారు. డ్రగ్స్ తీసుకున్న వారి ఆయుష్షు ...మిగతా 2లో



## లోకేశ్ సవాల్‌ను ఎదుర్కొనే ధైర్యం వైకాపాలో ఎవరికీ లేదు: పట్టాభిరామ్

**విజయవాడ:** తల్లికి వందనం పథకంపై మాజీ సీఎం జగన్ సహా వైకాపా మూకలు దుష్ప్రచారం చేస్తున్నాయంటూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నిజాయితీగా, ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి బిడ్డకు తల్లికి వందనం అమలు చేస్తూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసిందన్నారు. వైకాపా నాయకులు తల్లికి వందనం పథకంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నారా లోకేశ్ సవాలను ఎదుర్కొనే ధైర్యం వైకాపాలో ఎవరికీ లేదన్నారు. ఆరోపణలు నిరూపించలేక పారిపోయారని, ఇప్పుడు వారు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సిందేనన్నారు.

2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి బిడ్డకు అమ్మఒడి అమలు చేస్తే ఏడాదికి రూ.10వేల కోట్లు చొప్పున ఐదేళ్లకు రూ.50వేల కోట్లు తల్లుల ఖాతాల్లో వేయాలన్నారు. కానీ జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఇచ్చింది కేవలం 23,877 కోట్లు. సుమారు రూ.26వేల కోట్లు తల్లులకు ఎగనామం పెట్టిన ఘనుడు జగన్ అని విమర్శించారు. జగన్ పాలనలో అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య భారీగా కోత విధించి ఏటా లబ్ధిదారులను తగ్గించుకుంటూ వచ్చారని దుయ్యబట్టారు.

### తల్లికి వందనం సూపర్ సక్సెస్..
# జగన్ కడుపుమంట మూడింతలు పెరిగింది: లోకేశ్



**అమరావతి:** తల్లికి వందనం సూపర్ సక్సెస్ అవ్వటంతో తల్లుల కళ్లలో ఆనందం చూసి జగన్ రెడ్డి కడుపు మంట మూడింతలు పెరిగిందని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. మరోసారి తన విష పత్రికలో ఫేక్ ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. ఆరుగురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు ఇంకా డబ్బులు జమ చేయలేదని వెల్లడించారు. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం సిబ్బంది ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన తరువాత మాత్రమే వారికి నిధులు విడుదల అవుతాయన్నారు. దొంగ లెక్కలు, డబ్బులు కొట్టేయడం జగన్ రెడ్డి బ్రాండ్ అని దుయ్యబట్టారు. వైకాపా పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. మాది ప్రజా ప్రభుత్వం తప్పు చెయ్యం.. చెయ్యనివ్వమని స్పష్టం చేశారు. జగన్ రెడ్డికి కడుపు మంటగా ఉన్నట్టుంది.. రెండు ఈనో ప్యాకెట్లు పంపిస్తాను వాడండి.. కాస్త తగ్గుతుందని ఎద్దేవా చేశారు.

### రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్న సోకాల్డ్
# సంపాదకులు నాడు నిద్ర పోయారా..
## యనమల మండిపాటు



**అమరావతి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి అనుకూలంగా భావ ప్రకటనా స్వేచ్ఛపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీనియర్ సంపాదకులమంటూ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురిపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మీడియా స్వేచ్ఛను హరించినప్పుడు సోకాల్డ్ సీనియర్ సంపాదకులు నిద్రపోయారా.. అంటూ ప్రశ్నించారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడ్డం, అవమానాలకు గురి చేసే వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం వంటివి భావ ప్రకటనా స్వేచ్ఛ పరిధిలోకి రావని అన్నారు.రూల్ ఆఫ్ లా సాక్షి యాజమాన్యానికి, సాక్షిలో పని చేసే సిబ్బందికి వర్తించదా.. అని యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. వైఎస్ పాలనలో, జగన్ హయాంలో మీడియా వాచ్ పేరుతో నాటి ప్రభుత్వాలు నల్ల చట్టాలు తీసుకురాలేదా అని నిలదీశారు. నాడు భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగినట్టు కాదా అన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి సహా ఇంకొన్ని టీవీ ఛానెళ్లను నాటి ప్రభుత్వాలు కంట్రోల్ చేసే ప్రయత్నం చేయలేదా.. నాటి ప్రభుత్వాల తీరు భావ ప్రకటనా స్వేచ్ఛకు.. ఆర్టికల్ 19(1)కు విరుద్ధంగా లేదా.. రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్న సోకాల్డ్ సంపాదకులు నాడు నిద్ర పోయారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా నాటి ప్రభుత్వాలు వ్యవహరిస్తే నాడు ఎందుకు తప్పు పట్టలేదని అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా సాక్షి పత్రిక, ఆ ఛానెల్ ప్రజా ప్రతినిధులను అవమానించేలా దుష్ప్రచారం చేస్తూనే ఉన్నాయని, సాక్షి మీడియా తన దుష్ప్రచారంతో పరిపాలనకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూనే ఉందని యనమల రామకృష్ణుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.కాగా మాజీ సీఎం జగన్ అక్రమ ఆస్తులను ఇడుపులపాయలోని బంకర్లలోనే దాచిపెట్టారని యనమల రామకృష్ణుడు ఆరోపించారు. వారం రోజుల క్రితం కాకినాడ జిల్లా, తుని మండలం, తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వెన్నుపోటు దినం అంటూ జగన్ తన అవినీతి పత్రికను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారని, జగన్ కుట్రలను కూటమి నేతలు తిప్పికొట్టాలని పిలుపిచ్చారు.



## విశాఖ స్టీల్ ప్లాంట్ మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునఃప్రారంభం

**విశాఖపట్నం:** విశాఖ స్టీల్ ప్లాంట్ మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునఃప్రారంభమైంది. దీంతో స్టీల్ ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తికి మార్గం సుగమమైంది. స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణలో ఇదో మైలురాయని కేంద్రమంత్రి శ్రీనివాస్‌వర్మ ట్వీట్ చేశారు. ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు వందశాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి నేతత్వంలో స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ కోసం చేసిన కషికి ఇప్పుడు ప్రతిఫలం లభించిందన్నారు.

### వైకాపా సంఘ విద్రోహ కార్యక్రమాలను
# చూస్తూ ఊరుకోం
## మంత్రి పార్థసారథి

**అమరావతి:** పొదిలిలో వైకాపా నేతలు చేసిన ర్యాలీకి.. వారి ప్రవర్తనకు ఏమాత్రం సంబంధం లేదని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎవరైనా వస్తే తొక్కిపడేస్తామంటూ వారు ప్లకార్డులు ప్రదర్శించారని చెప్పారు. రైతుల ముసుగులో మహిళలు, పోలీసులపై రాళ్లు విసిరారని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడారు. ఈ సందర్భంగా పొదిలి ఘటనపై వీడియోలను ఆయన ప్రదర్శించారు.

"వైకాపా కార్యకర్తలు ప్రవర్తిస్తున్న తీరును రైతులు గుర్తించాలి. ప్రజా సమస్యలపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదు. నిజంగా అలా ఉంటే రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి. జగన్ పదవీకాంక్షతో అసెంబ్లీ ఎగ్గొట్టారు. ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని కోరారు. వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చినా ప్రజాసమస్యలు ప్రస్తావించరు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుం టుంది. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని జగన్ అసత్యాలు చెబుతున్నారు. నేర ప్రవత్తిని వైకాపా ప్రోత్సహిస్తోంది. రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని చూస్తోంది. ఆ పార్టీ సంఘ విద్రోహ కార్యక్రమాలను చూస్తూ ఊరుకోం" అని మంత్రి హెచ్చరించారు.



### ఇరాన్‌కు ట్రంప్ ధమ్కీ
## మేం చెప్పినట్టు వినకపోతే
# విరుచుకుపడ్తాం



**వాషింగ్టన్, జూన్ 15:** పశ్చిమాసియాలో అంటుకున్న అగ్గిని మరింత ఎగదోసే వ్యాఖ్యలు చేశారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడుల్లో అమెరికా ప్రమేయం లేదని ఉద్ఘాటించారు. అయినా, లెక్కచేయకుండా అమెరికాపై దాడికి తెగబడితే తమ సాయుధ దళాలు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో ఆ దేశంపై విరుచుకుపడతాయని హెచ్చరించారు. ఇరాన్ ఏ రూపంలో దాడి చేసినా తాము పూర్తి శక్తితో వాటిని తిప్పి కొడతామన్నారు. టెహ్రాన్-టెల్ అవీవ్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడం తనకు చాలా ఈజీ అని ట్రంప్ పేర్కొన్నారు. తాను తలుచుకుంటే ఈ సంఘర్షణను వెంటనే ...మిగతా 2లో

### ఇజ్రాయెల్‌పై సరికొత్త క్షిపణిని ప్రయోగించాం: ఇరాన్

ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రకటించింది. ఆ దేశానికి చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఈ విషయాన్ని తెలిపింది. ఆదివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో హజ్ ఖాస్సెం గైడెడ్ బాలిస్టిక్ మిస్సైల్ను వినియోగించారు. ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్జాదా మే 4న ఓ కార్యక్రమంలో ...మిగతా 2లో

### ప్రపంచపు అతిపెద్ద గ్యాస్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

పశ్చిమాసియా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్ ప్రధాన ఆర్థిక జీవనాడి అయిన ది సౌత్ పార్స్ క్షేత్రంపై దాడి చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం. టెహ్రాన్లోని ఇరాన్ అణు కేంద్రాలు సహా 150కి పైగా లక్ష్యాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇరాన్ చమురు ...మిగతా 2లో

# డ్రగ్స్, గంజాయిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

కూడా తరిగిపోతుందని చెప్పారు. జీవితంలో యువత ఎందుకూ పనికి రాకుండా పోతున్నారని అన్నారు. కొంతమంది ధన దాహానికి అమాయకుల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు డ్రగ్స్, గంజాయి నియంత్రణకు ఈగల్ టీంను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఏపీలో గత ఐదేళ్లుగా గంజాయి, డ్రగ్స్ రవాణా పెరిగిపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో డ్రగ్స్, గంజాయి రవాణాను నిరోధించామని అన్నారు. ప్రజల్లో కూడా వీటిపై మరింత చైతన్యం రావాలని చెప్పుకొచ్చారు. నో డ్రగ్, నో ఎడిక్షన్ అనే నినాదం అందరిలో ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు.

## రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు.. ఉరుములు, మెరుపులతో జోరు వానలు! ఎల్లో అలర్ట్ జారీ

**అమరావతి:** నైరుతి రుతుపవనాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో చురుగ్గా కదులుతున్నాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. బంగ్లాదేశ్ నుంచి ఉత్తర బంగాళాఖాతం మీదుగా దక్షిణ ఒడిశా వరకు, మరాఠ్వాడా నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు వేర్వేరుగా ఉపరితల ద్రోణులు ఏర్పడ్డాయి. అలాగే ఉత్తరాంధ్రకు ఆనుకొని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. నేడు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందందని వాతావరణ శాఖ సూచించింది.

## కూలిన వంతెన.. అనేక మంది గల్లంతు!

- **ఇంద్రాయణి నది ప్రమాద ఘటనలో ఇద్దరి మృతి**

**పుణె, జూన్ 15:** పుణెలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై గల వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ అనేక మంది జాడ తెలియరాలేదు.

## తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అవగాహన సదస్సు

**సిరిసిల్ల టౌన్, జూన్ 15(మనం న్యూస్):** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ చేపూరి బుచ్చయ్య అధ్యక్షతన ఆదివారం వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అవగాహన సదస్సు ఉదయం చేనేత వస్త్ర వ్యాపార సంఘంలో ఘనంగా నిర్వహించారు. ప్రారంభం లో విమాన ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అధ్యక్షులు చేపూరు బుచ్చయ్య పల్లె నా అవగాహన జరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ 2007, 2011 అధికరణం కేంద్రం వయోధికల సంరక్షణ కోసం ఏర్పడ్డ సెక్షన్లను పోస్టర్ల రూపంలో విడుదల చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలోనూ, ప్రతి మండలంలో మండల అధికారుల ఆఫీసుల కార్యాలయాల్లోనూ పోస్టరు అతికించాలని అందుకు మండల బాధ్యులకు సూచించారు. సీనియర్ సిటిజల్లందరూ 70 సంవత్సరాల ఆయుష్మాన్ భవ కార్డును వినియోగించుకోవాలన్నారు. అలాగే సీనియర్ సిటిజన్ కార్డు లేని వారు తీసుకోవాలని కోరారు. ఎక్కడ ఏ మూలన ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే కమిటీకి తెలియజేయాలని సూచించారు. కమిటీలో పరిష్కారం గా కేసులను ఆర్డిఓకి సబ్మిట్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్డీవో సమక్షంలో కౌన్సిలింగ్ లో పాల్గొనడానికి ఉత్సాహ వంతమైన మేధావులు కావాలని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మానవసేవే మాధవ సేవగా ముందుకు సాగాలన్నారు. రివర్స్ మాటిగేజి గురించి కూడా వివరించారు. ఏనుగుల ఎల్లయ్య మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల అవసరాలను తీర్చడానికి మేమున్నాం మీరు ధైర్యంగా ప్రతి పనిని చేయించుకోవడానికి ముందుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దొంత దేవదాసు, గుడ్ల శ్రీధర్, కైలాసం విద్యాసాగర్, గజ్జల్లి రామచంద్రం, అన్నారపు జ్ఞానోబా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 20న తెలంగాణ బంద్‌కు పిలుపు

### మావోయిస్టు నేత జగన్ పేరుతో లేఖ విడుదల

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అణచివేతకు నిరసనగా.. 'ఆపరేషన్ కగార్'ను తీవ్రంగా ఖండిస్తూ మావోయిస్టు నేతలు తీవ్రంగా స్పందించారు. ఈ నెల 20న తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా బంద్‌కు పిలుపునిచ్చారు. 'తెలుగు రాష్ట్రాల బంద్‌కు ప్రజలు సహకారం అందించి, విజయవంతం చేయాలని' కోరుతూ మావోయిస్టు నేత జగన్ పేరుతో ఒక లేఖను విడుదల చేశారు. దీంతో బలగాలు ఏఓబీ, సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పటిష్టం చేశాయి. తనిఖీలు ముమ్మరమయ్యాయి. అయితే, ఆపరేషన్ కగార్‌లో వందల సంఖ్యలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లలో మరణించారని, మానవ హక్కుల సంఘాలు ఈ చర్యలను ఖండిస్తున్నాయి. శాంతి చర్చలకు పిలుపునిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం మావోల ఏరివేతనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఈ లేఖలో తమ డిమాండ్లను, ఆపరేషన్‌పై తమ వ్యతిరేకతను తెలియజేశారు. మావోయిస్టు నేతలు బంద్‌కు పిలుపునివ్వడంతో.. భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఏఓబీ (ఆంధ్ర-ఒడిశా సరిహద్దు), తెలంగాణ-ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులతో పాటు అటవీ, ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతను గణనీయంగా ముమ్మరం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

**ఆపరేషన్ కగార్..**

'ఆపరేషన్ కగార్' అనేది మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో వారిని బలహీనపరచడానికి, వారి కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నేతృత్వంలో చేపట్టిన ఒక సమగ్ర సైనిక చర్య. ఈ ఆపరేషన్‌లో సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక బలగాలు, రాష్ట్ర పోలీసు దళాలు అటవీ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలను జల్లెడ పట్టి, మావోయిస్టుల స్థావరాలను ధ్వంసం చేసి, వారి కదలిక మార్గాలను తెగొట్టారు.

మరోవైపు సరైన న్యాయ ప్రక్రియ పాటించడం లేదని మానవ హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి.. శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నాలు చేయాలని కోరుతున్నాయి.

### మృత దేహాలైనా ఇవ్వండి..

# అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల కుటుంబీకుల ఆక్రందన

### ఛిద్రమైపోయిన ప్రతి శరీర భాగానికి డీఎన్‌ఏ టెస్టు చేస్తుండడంతో ఆలస్యమవుతున్న గుర్తింపు

**అహ్మదాబాద్, జూన్ 15:** అహ్మదాబాద్ ఘోర విషాదంలో సజీవ దహనమైన వారి మృతదేహాలను గుర్తించడం కష్టతరమవుతోంది. శరీరాలు ఛిద్రమైపోవడంతో అవి ఎవరివో తేల్చడం కత్తిమీద సాములా మారింది. ప్రతి శరీరభాగానికి డీఎన్ఏ టెస్టులు చేయాల్సి రావడంతో ఎక్కువ సమయం తీసుకుంటోంది. మరోవైపు మాంసపు ముద్దలు ఇచ్చి.. 'ఇవి మీ వారివే' అని వైద్యులు చెబుతుంటే.. బంధువులు అంగీకరించలేకపోతు న్నారు. ఒకట్రెండు ముక్కలు కాకుండా పూర్తి మృతదేహాలను అప్పగిస్తే అంత్యక్రియలైనా గౌరవంగా నిర్వహించుకుంటామంటూ ఆవేదన వెలిబుచ్చుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అహ్మదాబాద్లోని సివిల్ ఆస్పత్రిలోని శవాగారం వద్ద మృతదేహాన్ని తీసుకొచ్చే సంచీలో రెండు తలలు ఉండటం వివాదానికి తావిచ్చింది. అప్రమత్తమైన వైద్యాధికారులు వెంటనే మరోసారి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తన కుటుంబ సభ్యుల అవశేషాలన్నీ అప్పగించమని ఓ వ్యక్తి అధికారులను వేడుకున్నారు.



అయితే, అది సాధ్యం కాదని అతి కష్టం మీద ఆయనను అధికారులు ఒప్పించారు. కష్టమని తెలిసినా ఆత్మీయులను కోల్పోయిన బాధలో బాధిత కుటుంబీకులు వైద్యులను ప్రాధేయపడుతున్న తీరు కన్నీరు తెప్పిస్తోంది. ఓ వైపు కుటుంబీకులను కోల్పోయామన్న బాధ, మరోవైపు కనీసం వారి మృతదేహాలను కూడా ఇంటికి తీసుకెళ్లలేకపోతున్నామన్న ఆవేదనతో ఆస్పత్రి ఆవరణలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల అరిగోస పడుతుండడం చూసిన వారిని కలచివేస్తోంది. విమాన ప్రమాదంలో మృతి చెందినవారి మృతదేహాలను అహ్మదాబాద్లోని 1200 పడకల సివిల్ ఆస్పత్రిలో భద్రపరిచారు. రక్తసంబంధీకుల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి, మృతదేహాల నమూనాలతో సరిపోల్చి.. బంధువులకు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు 14 మంది మృతుల డీఎన్ఏను వారి కుటుంబ సభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు అధికారులు వెల్లడించారు. డీఎన్ఏ పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. వీలైనంత వరకు మిగతా మృతుల డీఎన్ఏను గుర్తించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

## మేం చెప్పినట్టు వినకపోతే విరుచుకుపడ్తం

(మొదటి పేజీ తరువాయి)

ముగించగలనని తెలిపారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పూర్తిగా నాశనం అవ్వకముందే తమతో అణు ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ ఇప్పటికే టెహ్రాన్ను హెచ్చరించారు. ఈ మారణ హోమం ఇలాగే కొనసాగితే ఇరాన్లో ఏమీ మిగలదన్నారు. ఒకప్పుడు ఇరానియన్ సామ్రాజ్యంగా పేరొందిన దేశాన్ని కాపాడుకోవాలంటే అక్కడి పాలకులు ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రరాజ్యంతో చర్చలు అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టంచేశారు. ఒకవైపు తమపై దాడులకు మద్దతునిస్తూ.. మరోవైపు అణు ఒప్పందంపై చర్చలకు ఆహ్వానించడం సరికాదని అన్నారు. తాము ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్ కుసహకరిస్తే ఆయా దేశాలకు చెందిన స్థావరాలపై దాడులు చేస్తామన్నారు.

### ఇజ్రాయెల్‌పై సరికొత్త క్షిపణిని ప్రయోగించాం: ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తమ వద్ద సరికొత్త బాలిస్టిక్ మిసైల్ సిద్ధమైందని ప్రకటించారు. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించుకొని వెళ్లగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ వీటిని కూడా వినియోగిస్తోంది. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లుగా ఇరాన్ పేర్కొంది. దీని వార్ హెడ్ తన గమనాన్ని మార్చుకోగలదని.. అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. దీనికి ఐఆర్జీసీ ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు చెప్పింది. కాకపోతే దీనిని కచ్చితంగా ఏ ప్రదేశంపై ప్రయోగించిందో మాత్రం వెల్లడించలేదు.

నిన్న రాత్రి ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో 200 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. బెట్యాప్ ప్రాంతంలో దాదాపు 35 మంది ఆచూకీ గల్లంతైందని ఆ దేశ మీడియా పేర్కొంది.

### ప్రపంచపు అతిపెద్ద గ్యాస్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ అధికారులు మీడియాతో మాట్లాడుతూ టెల్అవీవ్ దాడుల్లో షహ్రాన్లోని భారీ గ్యాస్ క్షేత్రం కూడా ధ్వంసమయినట్లు తెలిపారు. 11 నిల్వ ట్యాంకులు ఒకదాని తర్వాత ఒకటి పేలిపోతుండడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల సమీప నివాస ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.గ్యాస్ క్షేత్రాలపై దాడి ఆ దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. తాజా దాడుల్లో ఇజ్రాయెల్ క్షిపణి ఓ నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో 29 మంది పిల్లలతో సహా 60 మంది మరణించినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్లోని గలిలీ ప్రాంతంలోని ఒక అపార్ట్మెంట్ భవనంపై టెహ్రాన్ చేసిన ప్రతిదాడుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. శనివారం ఇరుదేశాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి.





## సైప్రస్‌లో మోడీ

(మొదటి పేజీ తరువాయి)

జరపనున్నారు.మూడు దేశాల పర్యటనకు బయల్దేరే ముందు ప్రధాని మోడీ చేసిన ఒక ట్వీట్ లో మధ్యధరా, ఈయూ ప్రాంతంలో సైప్రస్ను విలువైన భాగస్వామిగా పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సాంస్కృతికం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత పెంపొదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్- ఇరాన్ పరస్పర దాడుల కారణంగా పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల నేపథ్యంలో ప్రధాని మోదీ విమానం అరేబియా సముద్రం, ఆఫ్రికా గగనతలం మీదుగా సైప్రస్ కు చేరుకున్నట్లు సమాచారం. సైప్రస్ నుంచి ప్రధాని మోడీ కెనడాకు వెళ్లారు. అక్కడ జరిగే జీ-7 సదస్సుకు హాజరవుతారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఘనస్వాగతం

**రామగుండం, జూన్ 15 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి ఆదివారం రామగుండంకు వచ్చిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఘన స్వాగతం పలికారు. రామగుండం నియోజకవర్గం శాసనసభ్యుడు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ పూలమాలతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ రాజ్ ఠాకూర్ గారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రామగుండం నియోజకవర్గం ప్రత్యేక స్థానం దక్కించుకోవాలని, ప్రజల సహకారం ద్వారా మన ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందని, అడ్లూరి లక్ష్మణ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మన ప్రాధాన్యతకు నిదర్శనం అని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ... రామగుండం నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని, మౌలిక వసతులు కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా ఆరోగ్యారంగంలో సరైన ప్రణాళిక అమలుతో అన్ని వర్గాల అభివృద్ధి కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు.

## జిల్లా సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

- **ఆరు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**రాజన్న సిరిసిల్ల, జూన్ 15 (మనం ప్రతినిధి):** జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో వివిధ పోస్టులకు ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో మొత్తం 16 పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం పోస్టులకు గాను 904 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆరు రకాల పోస్టులు డిస్ట్రిక్ట్ చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ప్రొటెక్షన్ ఆఫీసర్లు(2), లీగల్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్ కోసం ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్హత, పని అనుభవం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మిగతా 10 రకాల పోస్టులకు సోమ, మంగళవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం తెలిపారు.

## భారత సంతతి వ్యక్తి మృతి



(మొదటి పేజీ తరువాయి)

కేవలం చిన్న వాగ్వాదమేనని అతడి భార్య అమృత్ పాల్ వారించినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. తాను ఎలాంటి నేరం చేయలేదని గౌరవ్ ఎంత వేడుకున్నా కనికరించలేదు. అతడిని బలవంతంగా నేలపై పడేసి అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ ఘటనను అమృత్పాల్ తన కెమెరాలో చిత్రీకరించడంతో పోలీసుల కర్కశత్వం బయటప అయితే, కిందపడిన తన భర్త మెడను ఓ పోలీసు అధికారి మోకాలితో గట్టిగా అదిమి పట్టాడని, అరెస్టు సమయంలో తల నేలకు, పోలీసు వాహనానికి బలంగా తాకడంతో గౌరవ్ అక్కడే స్పృహ కోల్పోయాడని అమృత్పాల్ ఆరోపించారు. ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అతడి మెదడు, మెడ నరాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని అమృత్పాల్ వేడుకున్నారు. ఈ చర్య 2020లో అమెరికాలో జరిగిన ఆఫ్రో- అమెరికన్ జార్జి ఫ్లాయిడ్ ఉదంతాన్ని తలపించిందని స్థానిక మీడియా కథనాలు ప్రచురిస్తోంది.

### బాసరలో విషాదం..

# గోదావరిలో మునిగి ఐదుగురు మృతి

- **మృతులంతా హైదరాబాద్ చింతల్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్బ్రాంతి**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన బాసరలో గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లిన ఐదుగురు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో బాసరలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులంతా హైదరాబాద్ చింతల్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తీ వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన వీరి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడ్డారన్నారు. అయితే, ఈ కుటుంబంలోని మొత్తం 18 మంది సభ్యులు ఆదివారం బాసరలోని సరస్వతీ అమ్మవారి



దర్శనం కోసం వెళ్లిన వీరు... దర్శనానికి ముందు, సంప్రదాయం ప్రకారం పుణ్యస్నానం ఆచరించేందుకు అక్కడే గోదావరి నదిలోకి దిగారు. ఈ క్రమంలో ఐదుగురు యువకులు నదిలోకి దిగి, నీటి ప్రవాహంలో లోపలికి వెళ్లారు. నీటి లోతుపై సరైన అంచనా లేకపోవడంతో వారు ఒక్కసారిగా మునిగిపోవడం ప్రారంభించారు.

నది ఒడ్డున ఉన్న కుటుంబ సభ్యులు ఇది గమనించి కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, నిపుణులైన ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. మృతులు రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌గా గుర్తించారు. వీరంతా 20 ఏళ్ల లోపు వయస్సు వారే కావడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోదావరి ఘాట్ వద్ద తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు తక్షణమే తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఘటనపై మంత్రి పొన్నం దిగ్బ్రాంతి... అధికారులకు ఆదేశాలు**

ఈ దుర్ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదుగురు యువకుల మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నదులు, నీటిపారుదల ప్రాజెక్టుల వద్దకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాలు, నదులు, ప్రాజెక్టుల వద్ద లోతును తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జనవరిలో కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు హైదరాబాద్ విద్యార్థులు సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో నీట మునిగి చనిపోయారని, అలాగే వారం రోజుల క్రితం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకులు గల్లంతయ్యారని మంత్రి గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

## అంతర్గాంలో ఆవో గావ్ చలో కార్యక్రమం

- **ఉచిత వైద్య శిబిరం లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**జగిత్యాల, జూన్ 15 ( మనం ప్రతినిధి):** జాతీయ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఆవో గావ్ చలో కార్యక్రమం లో భాగంగా జగిత్యాల రూరల్ మండలం అంతర్గం గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకొని గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ముఖ్యఅతిథిగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరానికి గ్రామంలో మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నాయకులు సమాజ సేవ కార్యక్రమాలతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి మంచి గుర్తింపు లభిస్తుంది అని ఎమ్మెల్యే ను ప్రశంసించారు.

# తిరుమలకు నో ప్లై జోన్ సాధ్యమా?

## నో ఫ్లైజోన్ ప్రకటించకపోతే ముప్పేనా?
## టీటీడీ అభ్యర్థనలను తోసిపుచ్చుతున్న డీజీసీఏ
## కూటమి ప్రభుత్వంలో టీటీడీ సాధించగలదా



**తిరుపతి, జూన్ 15 మనం న్యూస్ :** తిరుమలను నో ఫ్లైజోన్ గా చేయాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో పాటు, ఏపీ ప్రభుత్వం కూడా అభిలషిస్తోంది. ఇది భక్తుల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశంగా ప్రభుత్వం భావిస్తోంది. అయితే దశాబ్దాలు గడుస్తున్నా, ఆ అభ్యర్థన ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనా ఉంది. ఇటీవలి కాలంలో తిరుమల ఆలయంపై అనేక విమానాలు ఎగురుతున్నాయి. ఈ విమానాలను ఫోటోలు తీసి దాదాపు అన్ని పత్రికలు ప్రచురిస్తున్నాయి. దీని వల్ల ఆలయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందనే ఆందోళనలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి. తీవ్రవాదుల టార్గెట్ లో తిరుమల ఆలయం కూడా ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఆలయంలో వేలాది కోట్ల రూపాయల విలువ గల అనేక బంగారు ఆభరణాలు ఉన్నాయి. అవి ఎంతో ప్రాచీనమైనవి కావడంతో, వాటి విలువ పలు రెట్లు ఎక్కువగా ఉంటుంది. తిరుమలలో పోలీసులు, ఎస్ఎస్జీ, అక్టోపస్ లాంటి వివిధ భద్రతా బలగాలు కంటికి రెప్పలా కాడుతున్నా, దుండగులు విమానాలు, హెలికాప్టర్ల నుంచి నేరుగా ఆలయంలొ దిగే అవకాశం ఉంటుంది. అయితే భద్రతా దళాలకు వారి వారి వ్యూహాలు కలిగి ఉన్నా, అటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోడానికి నోఫ్లైజోన్ ఆవశ్యకత ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తిరుమలను నో ఫ్లైజోన్ చేయాలని గతంలో పలుసార్లు టీటీడీ కోరింది. దీనిని కేంద్ర ప్రభుత్వం కూడా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు సిఫారసు చేసింది. 2016లో టీటీడీ అభ్యర్థనను డీజీసీఏ తిరస్కరించింది. పురాతన కొండ ప్రాంతాన్ని నోఫ్లైజోన్ గా ప్రకటించలేమని స్పష్టం చేసింది. అయితే తాజ్ మహల్ ను 2006లో నోఫ్లైజోన్ గా ప్రకటించింది. తాజ్ మహల్ కు ఏడు కిలోమీటర్ల వ్యాసార్థంలో విమానాలు ఎగరడానికి అనుమతి లేదు. అదే విధంగా మన దేశంలో లేక పోయినా, ముస్లింల ప్రార్థనా స్థలం మక్కా కూడా నో ఫ్లైజోన్ లొ ఉంది. దీంతో పాటు రాష్ట్రపతి, ప్రధాని నివాసాలు, పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వ రక్షణ, క్షిపణి కేంద్రాలను నో ఫ్లై జోన్ లుగా ప్రకటించారు. అయితే హిందూ దేవాలయాలైన తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయం, కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయాలకు నోఫ్లై జోన్లు ఇవ్వడానికి డీజీసీఏ అంగీకరించడం లేదు. ఈ రెండు ఆలయాలకు అర్హత లేదని డీజీసీఏ చెబుతోంది. టీటీడీ ఛైర్మెన్ గా బీఆర్ నాయుడు నియమితులయ్యాక, ఆయన మరోసారి ఈ అంశాన్ని పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. తిరుమల ఆలయం పవిత్రతతో కూడుకుందని, విమానాలు ఆలయం పైన వెళ్లడంతో భక్తుల మనోభావాలు దెబ్బ తింటున్నాయని, పలువురు భక్తుల నుంచి తమకు అనేక అభ్యర్థనలు వస్తున్నాయని టీటీడీ ఛైర్మెన్, పౌర విమానయాన శాఖా మంత్రికి తెలిపారు. కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఉండటంలో ఈ సారి ఎలాగైనా నోఫ్లై జోన్ ను సాధించాలనే పట్టుదలతొ టీటీడీ అధికారులు ఉన్నారు. అవసరమైతే సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీతో దీనిపై చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భక్తులు కూడా దీనిపై కూటమి ప్రభుత్వానికి వినతులు అందజేయనున్నట్లు తెలుస్తోంది. డబుల్ ఇంజిన్ కూటమి ప్రభుత్వంలోనే ఇది సాధ్యమని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఇది ఎంత వరకు సాధ్యమవుతుందో వేచి చూడాల్సి ఉంది.




## వ్యక్తి నిత్య జీవితంలో యోగ ఒక భాగం ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

**కుప్పం, జూన్ 15, మనం న్యూస్:** వ్యక్తి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు ఆదివారం కుప్పం నియోజక వర్గం కుప్పం మండలం కంగుంది కోటలో యోగా అవగాహన కార్యక్రమం నకు ముఖ్య అతిధిగా ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పాల్గొన్నారు. ఆదివారంకుప్పం నియోజక వర్గం కుప్పం మండలం కంగుంది కోటలో యోగా అవగాహన కార్యక్రమం నకు ముఖ్య అతిధిగా ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించగా... యోగ గురువు బాబు యోగ విశిష్టతను వివరిస్తూ వివిధ ఆసనాలను వేసే పద్ధతిని నేర్పుతూ ఆ ఆసనాల ప్రాముఖ్యతను సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు.. డాక్టర్ సురేష్ ఆర్గనైజర్ సెక్రటరీ. రీజనల్ డైరెక్టర్ టూరిజం రమణ ప్రసాద్.ఆర్డిఓ కుప్పం శ్రీనివాసులు రాజు, డి ఎస్ డి ఓ బాలాజీ, జిల్లా పర్యాటకశాఖ అధికారి గౌరీ.. సర్పంచ్ సంపూర్ణ ధన శేఖర్. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వైస్ చైర్మన్ మాట్లాడుతూప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా జరుపుకోవడం జరుగుతుందని , కానీ ఈసారి జరిగే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో విశాఖపట్నం నందు జరుపుకోవడం ఒక ప్రత్యేకతను సంతరించుకుంటోందన్నారు. అందులో భాగంగా మన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతి జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని మనం ప్రారంభించి వదిలేయకుండా ప్రతినిత్యం యోగా కార్యక్రమాన్ని దినచర్యలో భాగంగా అలవాటుగా మార్చుకోవాలని చెప్పారు. అలాగే కుటుంబ పెద్దగా ఉన్నటువంటి వ్యక్తి యోగా చేస్తే వారి పిల్లలకు చిన్నప్పటినుండి అలవాటుగా మారుతుందని తెలిపారు. తద్వారా మీ ఆరోగ్యం,మీ కుటుంబం , సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర. స్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుపతి, జూన్ 15 మనం న్యూస్ :** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి 7.00 - 07.30 గంటలకు ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. గరుడ పటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపారు. దీంతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారని ఐతిహ్యం.

### వైభవంగా చక్రస్నానం

అంతకు ముందు ఉదయం 08.00- 9.00 గం.ల మధ్య పల్లకీ ఉత్సవం చేపట్టారు. తదుపరి 9.15 - 10.30 గం.ల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 - 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం 4.00- 5.00 గం.ల మధ్య శ్రీవారి మాడవీధి ఉత్సవం జరిగింది. వాహన సేవలో టిటిడి డిప్యూటీ ఈవో శ్రీ హరీంధ్రనాథ్, ఏఈవో శ్రీ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.

## స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవం....

### దేదిప్యమానంగా స్వర్ణగిరీశున్ని నిత్య కళ్యాణ మహోత్సవం
### శోభాయమానంగా శ్రీనివాసుడి తిరి వీధి ఉత్సవ సేవ.
### స్వర్ణగిరిలో 3500 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరణ



**భువనగిరి, జూన్ 15(మనం న్యూస్):** కలియుగ ప్రత్యక్ష దైవమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో నేటి ఉదయం సుప్రభాత సేవతో మొదలుకొని రాత్రి ఏకాంత సేవ వరకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , ఆలయ చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు , ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణాచార్యులు తెలిపారు. ఉదయం 10:30 లకు శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్న ఖచిత స్వర్ణాభరణాలతో, పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు దివ్యకరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో స్వామివారి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 3500 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. సాయంత్రం 6 గంటలకు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తులు తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు దేదిప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6:30 లకు గోదాదేవి పద్మావతి అలివేలు మంగమ్మల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవం భక్తుల గోవింద నామాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు శ్రీ స్వామి వారికి కర్పూర మంగళ హారతులను సమర్పించగా శ్రీవారిని భక్తులు నయనానంద కరంగా దర్శించుకున్నారు. ఈరోజు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

### జాతీయ మెగా లోక్ అదాలత్‌లో
## 13,048 కేసుల పరిష్కారం



**రామగుండం, జూన్ 15 (మనం న్యూస్):** రామగుండం కమీషనరేట్ పరిధిలో జాతీయ మెగా లోక్ అదాలత్ లో మొత్తం 13,048 కేసులు పరిష్కారం అయ్యాయని అన్నారు సిపి కిషోర్ అంబర్ ఝా. ఈ మేరకు జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధి పోలీసు స్టేషన్లలో నమోదై అండర్ ఇన్వెస్టిగేషన్ కోర్టు విచారణలో ఉన్న (కాంఫౌండబుల్) ఐపిసి కేసులు 536 పరిష్కరించబడ్డాయని, 80 సైబర్ క్రైమ్ కేసులలో బాధితులకు రూ.17,66,294 తిరిగి అందజేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులను సిబ్బందిని అభినందించారు. కమీషనరేట్ లో వివిధ సమావేశాలు ఏర్పాటు చేస్తూ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన రెండు జోన్ ల ప్రధాన న్యాయమూర్తిలకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిరోజు శాంతి భద్రతల సమస్యలను పరిరక్షిస్తూ అదేవిధంగా కోర్టు డ్యూటీ విధులను పర్యవేక్షిస్తూ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి కృషిచేసిన అధికారులు, సిబ్బంది తదితరులను సిపి ప్రత్యేకంగా అభినందించారు.

## రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పుస్తకావిష్కరణ




**తిరుపతి, జూన్ 15 మనం న్యూస్ :** 5కోట్ల మంది రాష్ట్ర ప్రజలు కు వెన్నుపోటు పుస్తకాన్ని తిరుపతి, చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి ఆర్. కే.రోజా, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ భరత్, , మాజీ ఎమ్మెల్యే సునీల్, విజయానంద రెడ్డి, నూకతోటి రాజేష్, తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు చవ్వా రాజశేఖర్ పాల్గొన్నారు. భూమన కరుణాకరరెడ్డి, మాట్లాడుతూ' ఏడాది కాలంలో కూటమి ప్రజలను వంచించింది. ప్రసారమధ్యమల్లో మా నాయకుడు పై విషాన్ని నింపడం జరిగింది. 2 లక్షల 80 కోట్ల రూపాయలు ను డి.బి.టి రూపంలో ప్రజలకు నేరుగా అందించారు. జగన్ మోహన్ రెడ్డి కంటే ఎక్కువగా రెండున్నర లక్షల కోట్లు ఇస్తామని ప్రజలను నమ్మించి భ్రమించారు. 2కోట్ల 7 లక్షలు మంది మహిళలకు నెలకు 1500 ఇవ్వకుండా మోసం చేశారు. నిరుద్యోగ భృతి 3వేలు ఇస్తామని చెప్పిన వ్యక్తి ఈరోజు మోసం, 30 లక్షలు మందికి తల్లికి వందనం మోసం చేశారు. రైతులకు 20 వేలు ఇస్తామని మోసం చేశాడు చంద్రబాబు. తల్లికి వదనం ప్రశ్నించే వాళ్ళను బెదిరిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం మోసాలు చేశాడు, ఒక అభూత కల్పనతో మోసగించాడు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లపై దాడులు చేయించి, కేసులు పెట్టి, జైల్లో పెట్టించాడు. అన్ని జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 5కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు.' మాజీ మంత్రి. రోజా మాట్లాడుతూ 'సుపరిపాలన కాదు..సూపర్ సిక్స్ కు ఎగనామం పెట్టిన పాలన. లక్ష అరవై వేల కోట్లఅప్పు చేయడం సుపరిపాలన అంటారా. లక్ష ఎనభై 80వేల కోట్లు ఎగనామం పెట్టడం సుపరిపాలన. సందు సందుకు మందుబాబులు తయారీ చేయడం, బెల్ట్ షాపులు దేవం, సి.బి. ఎన్ అంటే సి. చీటింగ్ బి అంటే బాదుడే బాదుడు ఎన్ అంటే నేరాలు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు బాదుడు, విద్యుత్ ఛార్జీలు బాదుడే బాదుడు. గత పాలన కంటే సంక్షేమం అందిస్తాము అని చెప్పి మోసం చేశారు. ఎల్లో బుక్ మానిఫెస్టో పక్కన పెట్టేశారు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. ఈరోజు ముఖ్యమంత్రి నిస్సిగ్గుగా అబద్ధం చెబుతున్నాడు సూపర్ సిక్స్ అన్ని అమలు చేసేశాం అంటున్నారు.. నాలుక మందం అంటున్నారు. గుండెల్లో ప్రేమ అభిమానం తో పొదిలి సభకు తరలి వచ్చారు. అమ్మకు ఒడి సృష్టికర్త జగన్ మోహన్ రెడ్డి. ఆరోజు అమ్మఒడి మీరు ఎగతాళి చేశారు.. మీరు ఇప్పుడు ఇస్తున్నారు. ఒక్క బాత్ రూం కూడా కట్టించక కుండా ఒక్కొక్కరి దగ్గర రెండు నొక్కేశారు. పదో తరగతి పరీక్ష పేపర్లు కూడా దిద్దడం మీకు చేతకాదు.-లోకేషా.... జోకేషా అని ప్రజలు నవ్వుకుంటున్నారు./మహిళలు పై అత్యాచారాలు జరుగుతుంటే పవన్ కళ్యాణ్ స్పంది స్పందించడం లేదు. ఎమ్మెల్యే అయ్యాను, డిప్యూటి సీఎం అయ్యను అని ఒక మూలాన కూర్చున్నారు పవన్ కళ్యాణ్. ప్రభుత్వానికి హనీ మూన్ టైం అయిపోయింది.. మీకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యింది. రెడ్ బుక్ రాజ్యాంగం పక్కన పెట్టండి.మామిడి రైతులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చంద్రబాబు చూసి సిగ్గు పడుతున్నారు. మ్యాంగో రైతులు కు కిలోకు 4 రూపాయలు కొనుగోలు చేస్తున్నారు, వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో 43 రూపాయలు కొన్నారు. రైతుల్లో కూడా క్యాస్ట్ ను చూసి మీపాలన చేస్తున్నారు..సనాతన యోగి ఏమై పోయాడు అర్థం కావడం లేదు. దేవాలయాలు ధ్వంసం. చేసి, స్థలాలు కబ్జా చేసే స్థాయికి పెరిగి పోయాయి. టిడిపి పార్టీ కూసాలు కదిలేలా ప్రజలు పక్షాన పోరాటాలు చేస్తాం' అని అన్నారు.

# కూటమి ప్రభుత్వానికి పట్టని శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్య



**తిరుపతి, జూన్ 15 మనం న్యూస్ :** స్థానిక కపిల తీర్థం రోడ్ లోని టీటీడీ పరిపాలనా భవనం వద్ద జరుగుతున్న దీక్షలు 300 రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం నాడు పూర్తి రోజు నిరాహార దీక్షను చేపట్టారు. ఈ దీక్షలలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, కార్యదర్శులు ఎస్. జయ చంద్ర, పి. మునిరాజలతోపాటు వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు సామూహికంగా నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల కుటుంబాలలోని మహిళలు వారి పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఫాదర్స్ డే రోజున తండ్రుల పోరాటానికి మద్దతుగా పసిపిల్లలు డిమాండ్ల చార్టులను పట్టుకుని నినాదాలు చేయడం పలువురిని ఆకర్షించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ చిన్న సమస్య పరిష్కారానికి వ్యాపారులు గత 300 రోజులుగా దీక్షలు చేస్తున్నా టిటిడి యాజమాన్యం గానీ, కూటమి ప్రభుత్వం గానీ పట్టించుకుని పరిష్కారం చేయకపోవడం అధర్మమని విమర్శించారు. టిటిడి చైర్మన్ గా బిఆర్ నాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి బోర్డు సమావేశంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల గురించి చర్చించామని సమస్యను పరిష్కరించామని స్వయంగా చైర్మన్ చెప్పిన తర్వాత కూడా సమస్యను పరిష్కరించక పోవడానికి కారణాలు ఏమిటో వెల్లడి చేయాలని కందారపు మురళి అన్నారు. టీటీడీ ఇఓ శ్యామలరావు, అడిషనల్ ఇఓ వెంకయ్య చౌదరిలు పలుమార్లు బాధితుల గోడు విన్నారని అయినా సమస్య పరిష్కరించకపోవడం దారుణమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం వీధుల్లో పోరాటం ఆనవాయితీ అయిందని, అటవీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడున్నర సంవత్సరాలు పాటు పోరాడామని, కూటమి హయాంలోనూ 300 రోజులు దీక్షలు పూర్తయ్యాయని... వైసీపీకి టిడిపి పాలనకు తేడా ఏమిటో బాధితులకు అర్థం కావడం లేదని విమర్శించారు. సమస్యల పట్ల సానుకూలంగా యాజమాన్యం స్పందించని పరిస్థితుల్లో చిరువ్యాపారులు కుటుంబాలతో సహా నిరవధిక దీక్షలకు పూనుకోవలసి వస్తుందని మురళి హెచ్చరించారు.

### అఖిలపక్షం మద్దతు

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటం 300వ రోజుకు చేరుకోవడంతో వారికి మద్దతుగా వివిధ రాజకీయ పక్షాల నేతలు హాజరై ప్రసంగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, సిపిఐ నేత ఎన్ డీ రవి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నేత డీఎంసీ భాస్కర్ తదితరు లు పాల్గొని మద్దతుగా ప్రసంగించారు. టీటీడీ యాజమాన్యం 300 రోజులుగా నిరసన దీక్షలు జరుగుతున్నా పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర వహించడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. పలువురు ఐఏఎస్ లు, ఐపీఎస్ లతో కూడిన అత్యున్నత టీటీడీ వ్యవస్థలో పేదల ధర్మ పోరాటాన్ని ఇంతకాలం పట్టించుకోకపోవడం న్యాయం కాదని అన్నారు.

బిఆర్ నాయుడు లాంటి వారు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు సామాన్యులకు వెసులుబాటు ఉంటుందని తాము భావించామని బి ఆర్ నాయుడు హయాంలోనూ సామాన్యులకు రక్షణ లభించకపోవడం ధార్మిక సంస్థలో సరైనది కాదని అన్నారు. తక్షణం టీటీడీ పాలకమండలి యాజమాన్యం పేదలైన శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

### ప్రజా సంఘాల మద్దతు

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటానికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి పి. సాయి లక్ష్మి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి చినబాబు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ జి. నాగ వెంకటేష్ మద్దతు ప్రకటించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు చిట్టిబాబు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మధు, యుగంధర్, ప్రకాష్ రామ్మూర్తి, శేఖర్, నరసింహ, మల్లి, మల్లికార్జున్, రాంబాబు, చిరంజీవి, శివ, గణేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ పాలస్తీనా

పాలస్తీనా.... ఓ నా పాలస్తీనా...
ఒకప్పుడు తళ తళా మెరిసే నేల నీది ....
నేడది బీభత్స రుధిర భూమి...
ఒకప్పుడు నీ అస్తిత్వం
అమేయం, అద్వితీయం, అపురూపం
అపాత్రదానం నిన్ను నిలువ
నీడ లేకుండా చేసింది.

భవిష్యత్ తరాలపై బాంబుల వర్షం కురిపిస్తూ ...
భవిష్యత్తే లేకుండా చేస్తోంది ఈ మారణ హోమం
తర తరాల తల్లుల ఆక్రందన తనువెల్లా
దహిస్తుంటే....
తడియారని గొంతుకలు
స్వేచ్ఛకోసం తపిస్తుంటే...
ప్లీజ్... మమ్మల్ని చంపకండీ అంటూ....
మాటలు రాని శిశువులు చేతులెత్తి
బోసినవ్వులు మర్చి,
ప్రాణ భీతితో మొక్కుతున్నా
కనికరం లేని రాక్షస మూక
విధ్వంస విలయ తాండవం చేస్తుంటే...
పచ్చ పచ్చని పాలస్తీనా...
అనంత వాయువుల్లో కలసిపోతే

**- గిరిజ పైడిమర్రి**
9949443414

## ఆశలతో కూలిన విమానం

అందరిని గమ్యానికి చేర్చాలని
ఎగిరిన విమానం
ఎగరకుండానే మండి మసి అయిపోయింది
రెక్కలు తెగిన పక్షిలా!
ఆశలను తీర్చలేని విమానం
ఆశయం కాని విమానం
అందరికీ విమానం పై అనుమానం !
విమానం శకలాలు శకలాలుగా దోషి !
అవమానంగా విమానం బూడిద బూడిద
గమ్యానికి చేర్చితే విమానం భేష్ భేష్
ఇప్పుడు మృత్యు విహంగమని దూషణలు !!
పొరపాటు ఎక్కడో !
ఎగరలేక మృత దేహలతో
అంత పెద్ద విమానం
స్మశానంగా పిలువబడుతోంది

**- కందాళై రాఘవాచార్య**
8790593638

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
**- ఎడిటర్**

# తెలంగాణ అన్నమాచార్య.. ఈగ బుచ్చిదాసు



యాదగిరి లక్ష్మీనరసింహస్వామి సేవలో నిష్ణాతులైన సంకీర్తన ఆచార్యులు ఈగ బుచ్చిదాసు. '₹తెలంగాణ అన్నమాచార్యులు'గా పేరుగాంచిన ప్రతిభావంతులు. వీరు వరంగల్ ప్రాంతానికి చెందినవారు. వైష్ణవ భక్తి కీర్తనలతో పాటు, శివ భక్తి సేవార్థం రాసిన కీర్తనల ద్వారా తన ప్రత్యేకతను ఏర్పరుచుకున్నారు. ఈగ బుచ్చిదాసు జీవిత వివరాలు, తల్లిదండ్రుల పేర్లు వంటి వ్యక్తిగత సమాచారం లభ్యం కాలేదు. లభ్యమైన సమాచారము ప్రకారం 1937-38 సంవత్సరాల మధ్య కాలంలో యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామిని సేవించేందుకు వచ్చి, అనంతర కాలంలో వరకు అక్కడే నివసించినట్లు తెలుస్తుంది.

ఈగ బుచ్చిదాసు స్వామి వారి సేవకు ముందుగా, అనారోగ్యంతో బాధపడుతున్న కాలంలో కొందరి ఆప్తుల సలహా మేరకు యాదగిరిగుట్టకు బయల్దేరారు. అక్కడ 'ఉత్పల చెన్నయ్య' అనే గురువు దగ్గరను దర్శనం చేసి, నరసింహస్వామి దీక్ష తీసుకున్నారు. దీక్ష స్వీకరణ అనంతరం స్వస్థత చేకూరడంతో స్వామివారి పట్ల విశ్వాసం, భక్తి మరింత దృఢపడింది. భక్తి, జ్ఞాన, తత్వ దృష్టితో స్వప్నంలో లక్ష్మీనరసింహస్వామి తనపై కీర్తనలు అల్లమని ఆదేశించారట. ఈ అనుభవం స్వామివారి కీర్తనల రచనకు శ్రీకారమయ్యింది. ఈగ బుచ్చిదాసు తన కీర్తనల్లో సామాజిక అంశాలను వేదాంత దృక్పథంతో అభివ్యక్తి చేశారు. వీరి రచనలో ప్రాథమికంగా అంత్యప్రాస విస్తృత వినియోగం కనిపిస్తుంది. ఇది భక్తి కీర్తనలలో పాఠకులకు శ్రవణ అనుభవాన్ని మరింత మధురంగా, సంగీతాత్మకంగా అందించేందుకు సహాయపడింది. ఇవి కాకుండా, తెలంగాణ ప్రజల జీవితంలో ఉపయోగించే నుడికారాలు మరియు జాతీయ భావాలతో కూడిన పదజాలం కూడా బుచ్చిదాసు సాహిత్యంలో స్పష్టంగా దర్శిమిస్తాయి.

ఈగ బుచ్చిదాసు గారి సాహిత్యం ప్రధానంగా భక్తి కీర్తనల ద్వారా స్పష్టమవుతుంది. ఆయన రచనల శ్రేణి యాదగిరి నరహరి శతకం (1964), యాదగిరి లక్ష్మి నరసింహ శతకం (1962), లక్ష్మీనరసింహస్వామి కీర్తనలు (1962) యాదగిరి నరహరి శతకం (1964) ఈ శతక కీర్తనలు నరహరి స్వామి భక్తి కేంద్రీకృతం. ఇందులో ఆధ్యాత్మిక, భక్తి భావాలను సునిశితంగా, సుగమమైన పద్యరూపంలో వ్యక్తం చేశారు. యాదగిరి లక్ష్మి నరసింహ శతకం (1962) లక్ష్మీనరసింహ స్వామి కీర్తనలు సంకలనం. ఇది భక్తులలో అపార స్ఫూర్తినిచ్చే విధంగా రూపొందించారు. యాదగిరి లక్ష్మీనరసింహ మంగళారతులు - ఈ మంగళారతులు వేడుకల సందర్భాల్లో స్వామివారి పూజా ఆచారాలతో జత కాకుండా భక్తులను ఆధ్యాత్మిక భావాలతో ఆకర్షించే విధంగా రచించబడ్డాయి. లక్ష్మీనరసింహస్వామి కీర్తనలు (1962) వివిధ భక్తి అంశాల ప్రదర్శనతో కూడిన ఈ సంకలనం. యాదగిరి శివ భజన కీర్తనలు. వైష్ణవ కీర్తనలతో పాటు, శివ భక్తిని వ్యక్తం చేసే ఈ కీర్తనలు విశేష ప్రజాదరణ పొందాయి. శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ బతుకమ్మ పాటలు (1968) సాంస్కృతిక రంగంలో కూడా ఈగ బుచ్చిదాసు తన సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేశారు. బతుకమ్మ పండుగ సందర్భంలో రాసిన ఈ పాటలు ప్రజల జీవితచరిత్ర, ఆచార సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి.

ఈగ బుచ్చిదాసు రచించిన భజన కీర్తనలు, శతకాలు, మంగళారతులు వంటి రచనలు తెలంగాణ భక్తిసాహిత్యంలో ప్రాథమిక ప్రాముఖ్యతను పొందినవే. ముఖ్యంగా ఆయన రచించిన యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహ భజన కీర్తనలు నాలుగు భాగాలుగా 1964 సంవత్సరంలో వెలువడినాయి. ఈ రచనను వెలుగులోకి తెచ్చింది ఎదులాబాద్‌కు చెందిన ప్రముఖ ముద్రణకారుడు పోలోజి నారాయణ. ఈ నాలుగు భాగాల్లో మొత్తం 127 కీర్తనలు లభ్యం. ప్రతి కీర్తనలోనూ భక్తి భావన, తాత్త్విక, భాషాశైలీ నైపుణ్యం స్పష్టంగా చూడవచ్చు. ఈ కీర్తనల శైలి అన్నమాచార్యుల సంకీర్తనల ప్రభావాన్ని సూచిస్తూనే, ప్రాంతీయ నుడికారాల వాడకంతో స్వతంత్ర లక్షణాన్ని సంతరించుకుంది.

శ్రీ యాదగిరి నరసింహ శతకం (1964) ఆయన సాహిత్యంలో ఒక ముఖ్య పాత్యమైన




శతక కావ్యం. ఇక్కడ బుచ్చిదాసు వాడిన మకుట పదబంధం 'యాదగిరి వాస నరహరి సాధుపోష' అనే ఈ పదం 'యాదగిరిగుట్టలో వాసం చేసే నరహరి స్వామి సత్పురుషులను పోషించేవాడు' అనే భావాన్ని ప్రకటిస్తూ, భక్తులకు భరోసా ఇస్తుంది. వీరి సాహిత్య రచనల్లో ఉపయోగించిన ప్రధాన శైలీ లక్షణాలు చూస్తే అంత్యప్రాస ప్రకటన,ఉత్ప్రేక్షాల వాడకం,స్థానిక నుడికారాల సమన్వయం,పౌరాణిక సంకేతాల అన్వయనం. ఇలా ఈ రచనలు బుచ్చిదాసు కేవలం భక్తిగా మాత్రమే కాక, సాహిత్యారాధకుడిగా కూడా నిలిచేలా చేసినవి.

తెలంగాణ భక్తి కీర్తనలలో వేదాంత ప్రభావం - శాంతా కృష్ణరావు (2010).ఈ గ్రంథంలో రచయిత ఈగ బుచ్చిదాసు సంకీర్తనల్లో వేదాంత తాత్వికతను విశదీకరించారు. మరియు తాత్విక మూలాల ప్రస్తావన ఈ అధ్యయనంలో కనిపిస్తుంది. ఈగ బుచ్చిదాసు సంకీర్తనలు: ఒక విమర్శాత్మక అధ్యయనం - ఎన్. వి. ప్రసాద్.ఈ పరిశోధనలో బుచ్చిదాసు రచనల శైలి, భక్తి భావన, ప్రజాప్రాచుర్యం పొందిన భాషా వాడకం, గ్రామీణ కదలికలు, ప్రజల భాషను సంకీర్తనల్లో ఎలా వెలికి తీశారన్న దానిపై విశ్లేషణ ఉంది. విమర్శాత్మక కోణంలో పరిశీలన జరగడం ఈ రచనకు ప్రత్యేకత. తెలంగాణ భక్తికావ్య పరిశీలన - ఎల్.వి. గోవిందరావు (2010) అధ్యయనంలో బుచ్చిదాసు సంకీర్తనల భక్తిపూరితతను, విశిష్టమైన ప్రాంతీయ ధోరణులను విశ్లేషించారు. తెలంగాణ భక్తిసాహిత్య పరిణామాలు - డా. ఎం. వెంకట రావు. పరిశోధన తెలంగాణ భక్తి సాహిత్యానికి ఒక విస్తృతమైన చరిత్రాత్మక దృక్పథాన్ని అందిస్తుంది. ఇందులో బుచ్చిదాసు స్థానం, వారి రచనల ప్రవాహం వివరించబడింది. తెలంగాణ సంకీర్తన సాహిత్యంలో భక్తి భావాలు - సురేష్, ఎం. ఈ వ్యాసంలో తెలంగాణ సంకీర్తన కవుల్లో భక్తి భావావేశం, లోతైన ఆధ్యాత్మిక దృష్టి ఎలా వ్యక్తీకరించబడిందో చెప్పబడింది. బుచ్చిదాసు కీర్తనల్లో భక్తి రూపాంతరాలను, మార్మికతను విశదీకరించారు. ప్రాంతీయ పదజాలం సాహిత్యంలో పాత్ర - నారాయణరావు, కె. (2012) రచనలో బుచ్చిదాసు రచనల్లో గల స్థానిక పదజాలం, గ్రామీణ జీవితానికి దగ్గరైన భాషా శైలిని విశ్లేషించారు. 'తెలంగాణ భాష'కు ఇది ఒక చైతన్యదాయకం అనే అంశాన్ని చర్చించారు.ఈ పరిశోధనలు భావి పరిశోధకులకు విలువైన దిశానిర్దేశాన్ని ఇస్తున్నాయి.

ఈగ బుచ్చిదాసు తన జీవితాంతం సంకీర్తనార్చనకు అంకితమై, భక్తిసాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందారు. జీవిత చివరిదశలో అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో రాసిన కీర్తనలను బాధా నివారణ కీర్తనలు రాశారు. ఇవి ఆయన వ్యక్తిగత బాధను అధిగమించడానికి తపస్సు రూపంలో తీర్చిదిద్దిన కవితా రూపాలు. ఈ కీర్తనలలో వ్యక్తిత్వ భావన, ఆత్మోన్నతి తపన స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. ఈ సంకీర్తన సంపదను భద్రపరచే కృషిలో బుచ్చిదాసు శిష్యురాలు 'సాధు బుచ్చిదాసు' విశేష కృషి చేశారు. ఆమె పునఃపరిశీలన, రచనల సేకరణ ద్వారా అనేక అముద్రిత కీర్తనలు వెలుగులోకి వచ్చాయి.

ఈగ బుచ్చిదాసు రచించిన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కీర్తనల సాహిత్యానికి పోలికగా, వివిధ కాలాలలో అనేక మంది రచయితలు యాదగిరిగుట్ట క్షేత్రాన్ని కేంద్రబిందువుగా చేసుకుని శ్రీ లక్ష్మీనరసింహ స్వామిపై శతకాలు, స్తోత్రాలు, సుప్రభాతాలు మొదలైన భక్తి రచనలను నిర్మించారు. ఈ రచనలు భక్తిసాహిత్యంలో యాదగిరి నరసింహుని ప్రభావాన్ని సూచించే సూచికలుగా నిలుస్తాయి.ఈ సందర్భంలో గమనించదగ్గ ముఖ్యమైన రచనలు మరియు రచయితలు చూస్తే యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్తోత్ర రత్నావళి (2010) - నల్దీగ కొండమాచార్యులు రచించిన ఈ గ్రంథం, యాదగిరి క్షేత్రంలోని దేవదేవుడైన నరసింహునిపై శ్లోకాల రూపంలో రచించారు. శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ సుప్రభాత స్తోత్రం (2011)- అసూరి మరికంటి జగన్నాథాచార్యులు రచించిన ఈ కృతి నిద్రలోని దేవుడిని మేల్కొలిపే ప్రార్థన. శ్రీ లక్ష్మీనరసింహ శతకం (1940)- నిటుకొండ బలరామశర్మ రచించిన ఈ ప్రాచీన శతకంలో వైష్ణవ తత్త్వబోధన ఉంది. శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ ప్రభు శతకం (1970) - అసూరి మరిగంటి పురుషోత్తమాచార్య రచన, శ్రీ యాదగిరి నృసింహ స్తవం (1953) - వాసిరెడ్డి బొమ్మినేని రచన, స్తుతిపరమైన శైలిలో రచించారు. శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ శతకం (2004) - ఎన్. యాదగిరిరావు. శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ స్తోత్ర తారామాల - ముడుంబై రంగాచార్యుల రచన, మాధుర్యంతో కూడిన అలంకారిక భాషాశైలితో ప్రత్యేక గుర్తింపు పొందింది. శ్రీ యాదగిరి నరసింహ ప్రభు శతకం (2010) - చెప్యాల రామకృష్ణారావు రచించిన ఈ శతకం సాంప్రదాయ శైలిలో గాఢభక్తిని ప్రతిబింబిస్తుంది. శ్రీ యాదగిరి నృసింహ శతకం (2013) - శ్రీ రామోజు లక్ష్మీ రాజయ్య రచనలో ప్రాంతీయ పదజాలం, నుడికారాలు సమృద్ధిగా ఉన్నాయి.శ్రీ యాదగిరి నృకేసరి శతకం - వేదశ్రీ వెంకటయ్య రచనలు ఉన్నాయి.ఈగ బుచ్చిదాసు తనను తాను ఆత్మకవిగా ప్రకటించుకున్నాడు. ఆత్మకవి అనే పదం ఇక్కడ కేవలం స్వీయ గౌరవంగా కాక, కవిత్వాన్ని ఆత్మానుభూతి చెందిన పదము గా చెప్పవచ్చు. ఈగ బుచ్చిదాసు 19 జూన్ 1957న పరమపదించారు. ఆయన భౌతిక దేహాన్ని యాదగిరిగుట్టలోని ఆలయం కింది భాగంలో సమాధిగా నిర్మించారు ఈ సమాధి ఆయన భక్తికి, సంకీర్తన జీవితానికి శాశ్వత గుర్తుగా నిలుస్తోంది. 2017లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా డా. పి. భాస్కర్ యోగి సంపాదకత్వంలో సంపుటాలుగా వెలుబడాయి. ఈ సంపుటాలతో బుచ్చిదాసు రచనల విలువను ప్రపంచ తెలుగు సమాజానికి పరిచయం చేశాయి.

**- డా. ఐ. చిదానందం**
8801444335

# పరిశోధనల నెలవంక సంగిశెట్టి



అమ్మ విత్తు నాటితే జీవ ఫలం. నాయన నాగలి సాలు తోలితే అన్నం. సంగిశెట్టి పరిశోధనా గండ దీపం. పరిశోధనేదైనా చరిత్రేదైనా వైతాళికుల వికాసాలను జీవన చరితలను అంబరాన నిలిపిన గొప్ప రచయిత. కమ్యూనిజమా? కోస్తావాదమా? అంటూ అసలు వాదాన్ని నిలదీశాడు. తెలంగాణ, తెలుగు సాహిత్య చరిత్రల దిక్సూచి చారిత్ర విమర్శకుడు సంగిశెట్టి.

తెలంగాణ దళితోద్యమ చరిత్రకు తెలంగాణ ప్రచురణ కర్తల తరపున రాసిన మాటల్లో .... మానవల్లి, శేషాద్రి రమణ కవులు ఆదిరాజు వీరభద్రరావు,సురవరం ప్రతాపరెడ్డి, బిరుదురాజు రామరాజు,బిఎన్ శాస్త్రీల అనంతరం పేర్కొన వలసిన అర్హత ఉన్నవాడు సంగిశెట్టి. మలిదశ తెలంగాణ ఉద్యమ సందర్భంలో ఆది పరిశోధకుడు మిగతా వారందరూ తర్వాతి వరస వారే అని రాసి ప్రశంసించారు.

ఎన్నో అపోహాలకు దీటైన సమాధానం. తలెత్తే విమర్శలకు ఎన్నో సందేహాలకు సాంత్వన, అస్తిత్వ వెన్నెముకకు ఉద్యమ దీప్తి,సవ్యసాచి,చూపులో సూర్యతేజం,మనసు వెన్నెల తలపు,ఆకాశంలా హద్దులు లేని పరిశోధనలు. కాలంతో పోటీపడి విరామం లేకుండా విస్తృత సాహిత్యాన్ని తన పరిశోధనా విమర్శల ద్వారా పత్రికా సంపాద కుడిగా, పుస్తక సంపాదకుడిగా, సహ రచయితగా, ఎన్నో రచనలను వెలికి తీసిన సాహితీ మూర్తి. తెలంగాణ ఉద్యమ సమయంలో సీమాంధ్ర దోపిడీ దార్లకు దీటైన సమదినాలు వ్యాసాలు, కర పత్రాలు పుస్తకాల రూపంలో అస్తిత్వ పోరాటానికి సాహిత్య పరంగా మొగురమై నిలబడ్డాడు. తెలంగాణ చరిత్రను వెలుగెత్తి చాటిండు. తాను తెలంగాణ వాదైనప్పటికి ఎవరికీ దక్కాల్సిన న్యాయాన్ని వాళ్లకు దక్కాలనీ విశాలస్వభావంతో ఆకురాయి లాంటి పరిశోధన చేశాడు.

ఆంధ్ర ప్రాంతానికి చెందిన తొలి దళిత కథకురాలు 'తాడినాగమ్మ' చరిత్రను వెల్దండి శ్రీధర్‌తో కలిసితీసుకొచ్చాడు తెలంగాణ ఉద్యమం ఉధృతమవుతున్న సమయం లో ఎన్నో విషయాల్ని, ఎందరో వైతాళికుల్ని వివిధ పత్రికల నుండీ వెలుగులోకి తెచ్చారు.. సోయి సాహిత్య పత్రికతో పాటు, వివిధ దినపత్రి కల్లో అనేక



వ్యాసాలు. గతంలో తెలంగాణ టైమ్స్, చర్చా పత్రికలో తన కంటూ ఒక 'కాలం'ని ఏర్పా టు చేసుకొని తెలంగాణ వెలుగుల్ని, సామాజిక రాజకీయ అంశాల్ని వరుసగా ఆ రెండు పత్రికల్లో విరివిగా రాశారు. 2004లో పత్రికలన్ని ఆంధ్ర ప్రాంతానికి, సంబంధించినవని మరి తెలంగాణ ప్రాంతంలో పత్రికలు లేవా? తనకు తానుగా వేసుకున్న ప్రశ్నకు జవాబు ఆయన తొలి పరిశోధనే 'షబ్నవీస్' తెలంగాణ పత్రికా రంగ చరిత్ర.ఆ తర్వాత 'దస్త్రమ్' తెలంగాణ కథల సూచి పేరిట విస్మరణకు గురయిన తొలినాటి వెయ్యి కథల్ని లెక్కగట్టి చెప్పడం జరిగింది. ఒక మనిషి ఇన్ని పనులు చేయగలడా? ఒక చెట్టు అన్ని కొమ్మలకు పూలు పూయలేదు.ఒక చెరువు అన్ని మడులకు నీళ్లు అందించలేదు. కానీ సంగిశెట్టి పత్రికారంగం మొదలుకొని సాహిత్య, సాంస్కృతిక రంగం దళిత బహుజన మహిళా రంగం ఇలా పలు రంగాల్లో ఆయన రచనలు పురుడు పోసుకున్నాయి.

మనకు తెలియని,మనం విస్మరించిన మన చరిత్రను నిటారుగా నిలబెట్టారు. 2004 నుంచి 2025 దాకా తాను ప్రచురిం చిన పుస్తకాలు చూస్తే నక్షత్రాలు నేలకు దిగినట్లుగా, ఒక పూల తోటలా సంగిశెట్టి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒకస్థానాన్ని స్థిరపరుచుకున్నాడు. సంగిశెట్టి శ్రీనివాస్ 1965 యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథ పురంలో జన్మించారు.

ఆయనది చేనేత కుటుంబం. చిన్నప్పుడే తల్లిదండ్రులతో పాటు హైదరాబాద్ వచ్చి చదువు కొనసాగిస్తూ విద్యార్థి నాయకుడుగా ఎదిగి, ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా పని జేసిన తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ స్థాపకుల్లో అతనొకరు. 1991 నవంబర్ ఒకటిన ఆర్ట్స్ కళాశాలపై ఆంధ్రప్రదేశ్ అవతరణకు వ్యతిరేకంగ నల్లజెండాను ఎగరేసిండు. అప్పటి నుంచి తెలంగాణ ఉద్యమంతో మమేకమ య్యాడు. తొలి కవయిత్రి కుప్పాంబిక, తొలి కథకురాలు బండారు అచ్చమాంబ. ఆవుల పిచ్చయ్య, వాసుదేవరావు సురమౌళి కథా సంపుటాలను వెలువరించాడు. సురవరం సమగ్ర కవిత్వంతో పాటు ఆయన వ్యాసాలను వెలువరించాడు. 'పడుగు పేకలు' మిత్రులతో కలిసి చేనేత జీవితాల కథలను సంకలనంగా వెలువరించారు. మరుగునపడ్డ తొలితరం తెలంగాణ కథకుల సూచీ 'దస్త్రమ్' ను వెలువరించారు. ఆంధ్రా కథకులతో పోలుస్తూ తెలంగాణ కథాచరిత్రను 'కథాత్మ' పేరిట వెలువరించారు.

తొలినాటి తెలంగాణ కథలు', తెలుగు యూనివర్సిటీ 'నూరేండ్ల తెలుగు కథ పుస్తకాలకు సహసంపాదకత్వం వహించారు. నూరేళ్ల తెలుగు కథ 'మాదిరెడ్డి సులోచన కథలు'ప్రపంచ తెలుగు మహాసభల సందర్బంగా తెలుగు నవలా చరిత్రను వ్రాశారు..ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం పరిశోధనలో భాగంగా తెలంగాణ పత్రికారంగ చరిత్ర 'షబ్నవీస్'ని చిత్రీకరించారు. తెలంగాణ చరిత్రకు అద్దం 'హైదరాబాద్ సిర్ఫ్ హమారా' పేరిట పుస్త కాన్ని రాసారు. తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి జీవిత చరిత్రను తెలుగుఅకాడమీ, సాహిత్య అకాడమీలు ప్రచురించాయి. 'రామప్ప రభస' పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. తెలంగాణ నవలా చరిత్ర విమర్శను రాశారు. రచయితగా 30,పుస్తకాలు, సహ రచయితగా 6 పుస్తకాలు, సంపాదకులుగా 30 సంకలనాలు,ఉప సంపాదకులుగా 28 కి పైగా సంకలనాలను వెలువరించడం ఒక చరిత్ర.తెలంగాణ హిస్టరీ సొసైటీ, సింగిడి, దస్కత్, బహుజన కథకుల కచ్చీరు తరపున అనేక కార్యక్రమ నిర్వహణలో ప్రధాన భూమిక పోషిం చారు.

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం అభిమాన విషయాలుగా అనేక పరిశోధన పత్రాల్ని, వ్యాసాల్ని వెలువరించారు.

**- వనపట్ల సుబ్బయ్య**
94927 65358

## 'వి'మానవ విస్ఫోటనం

రన్ వే మీదుగా
నెమ్మదిగా టేకాఫ్ అవుతుంటే
విండో లోంచి
అందంగా కనబడుతన్న
అహ్మదాబాద్ విమానాశ్రయం
నేల విడిచి నింగి వైపు

పరుగులు తీసే విమానం...!!
అందులో పయనించే
ప్రతీ గుండెకూ ఓ కల
తొలిసారి లండన్ వెళ్ళేవి

సెలవు దినాలు గడిపి
తిరిగి ఉద్యోగానికై ఇంకొన్ని...!!
నిమిషాల క్రితం
వీడ్కోలు పలికిన బంధాలు

ఎయిర్ పోర్ట్ ఆవరణ దాటాయో లేదో
ఇప్పుడే టేకాఫ్ అయ్యామనే
సమాచారం తనవారికి చేరిందో లేదో

ఉన్నపళంగా ఒక్కసారిగా
ఏం జరిగిందో తెలిసే లోపు
గుండెలు పగిలే విస్ఫోటనం...!!
జనావాసాల నడుమ
నేలను తాకి పేలిన విమానం

బద్దలైన అగ్ని పర్వతంలా
ఆకాశంలోకి ఎగబాకిన
దట్టమైన నల్లటి పొగలు..!!

ఆ దృశ్యం చూసిన
ప్రతి గుండె ఆగిపోయింది
కాలి బూడిదైన విమాన శకలాలు
ఆనవాలు తెలియనంతగా
రక్తపు ముద్దలుగా దేహాలు...!!

కారణాలు ఏమైతేనేం
కొన్ని వందల కుటుంబాలు

కన్నీటి సంద్రంలో మునిగిపోయాయి
కొన్ని సంవత్సరాల కలలు
నేలరాలి కాలి బూడిదయ్యాయి..!!

**- యు.ఎల్.ఎన్.సింహా**
77022 80542

# ఆధ్యాత్మిక కవి రామభద్రాచార్య



వేదాలు, ఉపనిషత్తులు, పురాణేతిహాసాలు, ప్రబంధాలు, కావ్యాలు రచింపబడ్డ సాహిత్య భాషగా పేరున్నది సంస్కృత భాషకే.సంస్కృతం మాట్లాడే వారు దాదాపు 16వేలు పైచిలుకు ఉంటారని ఒక లెక్క. భారత రాజ్యాంగంచే గుర్తింబడ్డ 24 భారతీయ భాషలలో సంస్కృత భాష ఒకటి. అనేక చారిత్రిక భాషా ఆధారాలున్న పురాతన ఇండో-యూరోపియన్ భాషలలో సంస్కృతం ఒకటి. సంస్కృత సాహిత్యంలో హిందూ మతం, సూఫీ, నృత్యం, సంగీతం మరియు వైద్యం వంటి అనేక అంశాల గురించిన సమాచారం ఉంది. ఏ భాషైనా, వస్తువైనా జన సామాన్యానికి దగ్గరగా ఉండదో.. అది సామాజిక వెలికి దగ్గరౌతున్నదని అర్థం. సంస్కృత భాషలో కవులు రచయితలు అనువాదకుల చేసే కృషి గొప్పది. ఆ కోవలోనే 2023 జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆధ్యాత్మిక కవి రామభద్రాచార్య చేసిన కృషి కూడా గొప్పది. జగద్గురు రామానందచార్య స్వామి రామభద్రాచార్యగా ప్రసిద్ధి చెందిన హిందూ ఆధ్యాత్మికవేత్త. బహుముఖ ప్రజ్ఞాశాలియైన భారతీయ హిందూ ఆధ్యాత్మికవేత్త, విద్యావేత్త, బహుభాషావేత్త, కవి, రచయిత, వచన వ్యాఖ్యాత, తత్వవేత్త, స్వరకర్త, గాయకుడు, నాటక రచయిత, కథా కళాకారుడు కూడా. ప్రస్తుత నలుగురు జగద్గురు రామానందచార్యలలో ఒకడు. 1988 నుండి ఈ పదవిని పొందాడు. జగద్గురు రామభద్రాచార్య భారతదేశంలోని ఉత్తరప్రదేశ్‌లోని జౌన్పూర్ జిల్లాలోని షండిఖుర్ద్ గ్రామంలోని వసిష్ఠ గోత్రానికి చెందిన బ్రాహ్మణ కుటుంబంలో పండిట్ రాజ్‌దేవ్ మిశ్రా, శచీదేవి దంపతులకు జన్మించాడు. అతను 1950 జనవరి 14 న మకర సంక్రాంతి రోజున జన్మించాడు. అతనికి తన మేనత్త, పితామహునికి దాయాది పండిట్ సూర్య బాలి మిశ్రా 'గిరిధర్' అని పేరు పెట్టారు. అతని మేనత్త మీరాబాయి ఆరాధకురాలు. మీరాబాయి కృష్ణుని చేసే సంబోధనలలో ఎక్కువగా 'గిరిధర్' అని ఉపయోగించడం వల్ల అతనికి 'గిరిధర్' అని నామకరణం చేసింది. గిరిధర్ రెండు నెలల వయసులో మార్చి 24,1950న ట్రాకోమా వ్యాధితో కంటి చూపు కోల్పోయాడు. ఆ జబ్బుకు చికిత్సగా బొంబాయిలో చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమై అంధుడైనాడు. ఈయన తన గురువులైన రామప్రసాద్ త్రిపాఠి వద్ద సంస్కృతం, ఈశ్వర దాస్ వద్ద మంత్రం, రామచరణ్ దాస్ వద్ద సంప్రదాయం విద్యల అభ్యాసం చేశారు. ఇతడు విశిష్టాద్వైత వేందాంత తత్వాన్ని నమ్మి బోధన చేశారు, వ్యాప్తి చేశారు. రామభద్రాచార్య తులసీదాసు పేరు మీద చిత్రకూట్‌లో ఉన్న మత, సామాజిక సేవా సంస్థ తులసి పీఠ్ స్థాపకుడు. చిత్ర కూట్‌లోని జగద్గురు రామభద్రాచార్య వికలాంగుల విశ్వ విద్యాలయ స్థాపకుడు, జీవితకాల ఛాన్సలర్. ఇక్కడ నాలుగు రకాల వికలాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తుంది. రామభద్రాచార్య రెండు నెలల వయస్సు నుండి అంధుడు ఆంగ్ల కవి జాన్ మిల్టన్ కూడా అంధుడే కానీ నడి వయస్సు దాటాక. మొత్తంగా సాహిత్య ప్రపంచంలో పదిహేడేళ్ల వయస్సు వరకు ఆయన పాఠశాల విద్య నేర్చుకోలేదు.అందుకూ సంగీతంకోసం బ్రెయిలీని కానీ, మరే సహాయాన్ని ఉపయోగించలేదు.ఆతడు తన ప్రారంభ విద్యను తండ్రియైన తాతనుండి బొంబాయిలో నేర్చుకున్నాడు. తాత ప్రతిరోజు రామాయణ భారతాల్లోని వివిధ కథలను,విశ్రామ్ సాగర్,సుఖం సాగర్,ప్రేమ్ సాగర్,బ్రిజ్విలాస్ వంటి భక్తి రచనలను చెప్పేవాడు. మూడేళ్ల వయసులో గిరిధర్ తన మొదటి కవితా భాగం అవధి (హిందీ మాండలికం)లో కూర్పు చేసి దాన్ని తాతకు వినిపించాడు. గిరిధర్ ఉపనయనం జూన్ 16,1961రోజు జరిగిన సమయంలో అతనికి గాయత్రీమంత్రంతో పాటు దీక్ష ఇవ్వబడింది. చాలా చిన్న వయసులోనే భగవద్గీత రామచరిత్ మన్‌లలో ప్రావీణ్యత పొందిన గిరిధర్ తన ఊరు దగ్గర రామ్ చరిత్ మానస్ పైన చెప్పిన కథ అనేకమంది ప్రశంసలు అందుకుంది.

రామభద్రాచార్య 22 భాషలలో ధారాళంగా మాట్లాడే విద్యావేత్త. ఆయన సంస్కృత, హిందీ, అవధి, మైథిలి భాషలతో పాటు అనేక ఇతర భాషలలో ఆశుకవి, రచయిత కూడా. అతను నాలుగు పురాణ కవితలు తులసీదాసు రామచరిత మానస్, హనుమాన్ చాలీసా గ్రంథాలపై హిందీ వ్యాఖ్యానాలు, అష్టాధ్యాయ పద్యాలకు సంస్కృత వ్యాఖ్యానం, ప్రస్థానత్రయం గ్రంథాలపై సంస్కృత వ్యాఖ్యానాలతో సహా 100 కు పైగా పుస్తకాలు, 50 పత్రాలను రచించాడు. సంస్కృత వ్యాకరణం, న్యాయ, వేదాంతాలతో సహా విభిన్న రంగాలలో అతనికున్న అపార జ్ఞానం వల్ల అతను గుర్తింపు పొందాడు. ఆయన భారతదేశంలో తులసీదాసు సాషిత్యంపై గొప్ప అథారిటీ కలిగిన సాహితీవేత్త. అతను రామచరిత మానస విమర్శనా గ్రంథానికి సంపాదకుడు. ఆయన రామాయణం, భాగవత కథా కళాకారుడు. అతని కథా కార్యక్రమాలు భారత దేశం, ఇతర దేశాలలో వివిధ నగరాల్లో క్రమం తప్పకుండా జరుగుతాయి.

విద్యాశాలలో చదువు గిరిధర్ పదిహేడేళ్ల వయస్సు వరకు పాఠశాల విద్య లేదు. అతను చిన్నతనంలో వినడం ద్వారా అనేక సాహిత్య రచనలను నేర్చుకున్నాడు. 1967 జూలై 7 న గిరీధర్ సమీప జౌన్పూర్‌లోని సుజన్‌గంజ్ గ్రామంలోని ఆదర్శ్ గౌరిశంకర్ సంస్కృత కళాశాలలో సంస్కృత వ్యాకరణం, హిందీ, ఇంగ్లీష్, గణితం, చరిత్ర, భూగోళశాస్త్రం అధ్యయనం చేశాడు. తన ఆత్మకథలో అతను ఈ రోజును తన జీవిత ప్రయాణంలో ముఖ్యమైన దినంగా గుర్తుచేసుకున్నాడు. విషయాన్ని ఒక్కసారి వినడం ద్వారా గుర్తుంచుకునే ప్రతిభా సామర్థ్యాలు గొప్పవి. గిరిధర్ మూడు నెలల్లో వరదరాజు రాసిన 'లఘుసిద్ధంతకౌముది' గ్రంథాన్ని కంఠస్థం చేసి ప్రావీణ్యం పొందాడు. అతను నాలుగు సంవత్సరాలు తన తరగతిలో అగ్రస్థానంలో ఉన్నాడు. సంస్కృతంలో ఉత్తర, మధ్యమ హయ్యర్ సెకండరీ పరీక్షలో మొదటి శ్రేణిలో, డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. 1971లో గిరిధర్



గ్రాడ్యుయేషన్ మాస్టర్స్ డిగ్రీ కోర్స్ వ్యాకరణంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి వారణాసి లోని సంపూర్ణానంద్ సంస్కృత విశ్వవిద్యాలయం లో చేరాడు. ఆయన 1974 లో బి. ఏ. డిగ్రీ 'శాస్త్రి'తుది పరీక్షలో అగ్రస్థానంలో నిలిచాడు. తరువాత అదే సంస్థలో 'ఆచార్య'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీలో చేరాడు. మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నప్పుడు అతను అఖిల భారత సంస్కృత సదస్సులో వివిధ జాతీయ పోటీలలో పాల్గొనడానికి న్యూ ఢిల్లీకి వెళ్ళాడు. అక్కడ అతను ఎనిమిది బంగారు పతకాలలో ఐదింటిని గెలిచాడు. అతను వ్యాకరణం, సాంఖ్య, న్యాయ, వేదాంత, సంస్కృత అంతక్షరి విభాగాలలో ఈ పతకాలను సాధించాడు. అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఐదు బంగారు పతకాలతో పాటు ఉత్తర ప్రదేశ్ తరపున చల్వాయి జయంతి ట్రోఫీని గిరిధర్కు అందజేశారు. అప్పుడు ఇందిరా గాంధీ తన కళ్ళ చికిత్స కోసం తన సొంత ఖర్చుతో అమెరికాకు పంపమని ప్రతిపాదించింది కానీ గిరిధర్ ఈ ప్రతిపాదనను సున్నితంగా ఒక సంస్కృత పద్యంతో తిరస్కరించాడు. 1976 లో వ్యాకరణంలో జరిగిన ఆచార్య పరీక్షలలో గిరిధర్ అగ్రస్థానంలో నిలిచాడు, ఏడు బంగారు పతకాలు, ఛాన్సలర్ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. అరుదైన విజయంలో అతను వ్యాకరణంలో మాస్టర్స్ డిగ్రీకి మాత్రమే చేరినప్పటికీ, 1976 ఏప్రిల్ 30 న విశ్వవిద్యాలయంలో బోధించిన అన్ని సబ్జెక్టులకు ఆచార్యునిగా ప్రకటించడం ఆయన అసాధారణ ధారణ ప్రతిభకు తార్కాణం .

శ్రీ రామభద్రాచార్య ఎన్నో రచనలు చేశారు. అందులో "Shri Ram Bhadracharyaji & A Religious Head With A Vision' గ్రంథం ప్రసిద్ధమైనది. ఇంతటి విశేష కృషి చేసిన విద్యా సాహిత్య సామాజిక ధార్మిక రంగాలలో అవిశ్రాంత సేవలందిస్తున్న రామభద్రాచార్యను 2023లో భారత ప్రభుత్వం జ్ఞానపీఠ పురస్కారంతో సత్కరించడం ఎంతైనా సముచితం.

**-డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
98493 05871

# అరకపట్టి...! పొలం దున్ని...!!



## కూసుమంచిలో ఏరువాకకు మంత్రి పొంగులేటి శ్రీకారం

## రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

కూసుమంచి, జూన్ 15(మనం న్యూస్)ః రైతుల శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గం పర్యటనలో భాగంగా కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన ఏరువాక కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అరక పట్టి పొలం దున్నారు. రైతు సోదరులకు, మహిళా కూలీలకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ఈ ఏడాది మంచి వర్షాలు పడి పాడిపంటల ఎగుమతిలో తెలంగాణ దేశంలోనే అగ్ర స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

## యోగా ఆరోగ్యానికి శ్రేయస్కరం



- సంధ్య యోగా నిపుణులు

ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః జూన్ 21వ తేదీ వరకు పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాదం, వర్తమాన్ యోగా సెంటర్ వారి సారధ్యంలో ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారంఉదయం స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నందు యోగా శిక్షణ ప్రారంభించారు. ముందుగా యోగా నిపుణులు సంధ్య వారి బృందానికి వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ప్రముఖ సీనియర్ డాక్టర్ సామినేని సీతయ్య, వాకర్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రామనాథం, రాకం శ్యామ్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగా నిపుణురాలు సంధ్య చే పెవిలియన్ గ్రౌండ్ లోని నడక సాధకులతో నేటి జబ్బులు వాని పరిష్కార మార్గ ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని ఎలా పెంపొందించు కోవాలని నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఖమ్మం నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత యోగా శిక్షణ ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు. మొదటి రోజు యోగా శిక్షణ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నడక సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, మందా. వెంకటేశ్వర్లు,చంద్రశేఖర్, వెంకట్, భాస్కర్, పద్మ, సబిత, మమత తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో ఖమ్మం డీఎంఏ ప్రభంజనం..

- జాతీయ స్థాయిలో 307వ ర్యాంకు కైవసం
- ఓపెన్ కేటగిరిలో స్టేట్ 11వ ర్యాంకు
- మీడియా సమావేశంలో డీఎంఏ డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, భరణి కుమార్



ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః వైద్య విద్యలో ప్రవేశం కొరకు ఎన్ టి ఏ నిర్వహించిన జాతీయ స్థాయి మెడికల్ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ఖమ్మం డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు తమ సత్తా చాటారు. డీఎంఏ కు చెందిన విద్యార్థిని తూము వెన్నెల జాతియ స్థాయిలో 307వ ర్యాంకు సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు సాధించి డాక్టర్స్ మెడికల్ అకాడమీ కీర్తి పథకాన్ని జాతీయ స్థాయిలో రెపరెపలాడించిందని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఖమ్మం లోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, ఈగ భరణి బాబు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఓపెన్ క్యాటగిరిలో ఆల్ ఇండియా 307వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంస్థ ప్రారంభించిన దగ్గర నుండి ప్రతి ఏడాది కార్పొరేట్ విద్యతో పోటీపడుతూ ఖమ్మం కేంద్రంగా వేలాది మందిని వైద్యులుగా తీర్చిదిద్దిన ఘనత తమ సంస్థకు దక్కుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రస్తుత ఫలితాల్లో డిఎంఏ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ప్రధానంగా ఓపెన్ క్యాటగిరి లోను తమ విద్యార్థులు సత్తా చాటడం తమ సంస్థ యొక్క ఔన్నత్యాన్ని చాటుతుందన్నారు. ఇంతటి ఘనతను సాధించడానికి కారకులైన ఫ్యాకల్టీకి, విద్యార్థులకు, పేరెంట్స్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరిన్ని ఫలితాలు సాధించి మరింత మంది విద్యార్థులు డాక్టర్ కావాలన్న కలలను నిజం చేస్తామని వారు హామీ ఇచ్చారు.

### ఓపెన్ కేటగిరిలో స్టేట్ 11వ ర్యాంకు

శనివారం విడుదలైన నీట్ ఫలితాలలో ఖమ్మంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ దేశస్థాయి ఫలితాలు సాధించింది. రాజధాని మినహా తెలంగాణ రాష్ట్రం మొత్తంలో అత్యధిక మార్కులు 626 మార్కులను తూము వెన్నెల సాధించింది. ద్వితీయ స్థానంలో రిషిక శర్మ 588 మార్కులతోను, ప్రియాంక కు ఎస్. టి కేటగిరిలో ఆలిండియా 171 ర్యాంకు సాధించడమే కాకుండా టి. వెన్నెల- 626, రిషిక శర్మ-588, బి. ప్రియాంక - 521, అతియా తరణమ్-509, ఎ. వర్ష-505, కె. మోక్షిత శరణ్య - 496, షేక్. సమీన మధార్ 496, రేణుశ్రీ 489, యశ్వంత్ 482, అయేషా సమీర-481, సీహెచ్ క్షేత్ర 474, జి. వెన్నెల రెడ్డి-467, కె.వి. నిక్షిత-463, జి. అనుష- 461, షేక్. నూరె వసీమ్ యం. డి. సునైనా-450, వైష్ణవి 451, ఎస్ విఘ్నేన్ రెడ్డి- 444, బి. అక్షయ-443, ఎ. ఇందు 443, లోహిత 440, వి. ఆరూష్ నందన్ -439, టి. అక్షిత-438, బి.సచీన్ నాయక్ -436, వహిదా 435, టి. నాగచరిత-433, జి. చరణ్ దేష్ 432, హుమామా - 430, వి.నవీన్ కుమార్-427, జి. రిత్విక - 422, బి. వాణి 421, జే షాలిని 421, వీణ-420, (419, బి. రమ్య-417, డి. దర్షిత-416, హట్కర్సాయి కీర్తన- 414, వి. లక్ష్మీ సువర్ణ-413, డి.అంజలి-411, ఎమ్.డి. సైమా అఫ్రోజ్-410, టి. వైష్ణవి-410, కె. శ్రీరామ్ చౌదరీ-408, డి. శ్రుతి-407, శ్రీరామ్ సాయి-405, అంకె. పవన్ కుమార్- 403, ఎస్.మహేష్ కుమార్-402, కె. శ్రీ.చందన-400 , ఎల్. సిద్ధార్థ-400 మార్కులను సాధించారు.

### విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దిక్సూచి డీఎంఏ..

500 మార్కులపైన 6 గురు, 450 పైన 21 మందికి, 400 మార్కుల పైన 62 మందికి మరియు 122 మందికి పైగా గవర్నమెంట్ ఆలఖి సీట్లు సాధిస్తున్న ఏకైక సంస్థ డాక్టర్స్ మెడికల్ అకాడమీ, ఖమ్మం. 2024 లో 108 గవర్నమెంట్ ఎంబీబీఎస్ సీట్లు, 2023 లో 95, 2022 లో 75 మందికి ఎంబీబీఎస్ సీట్లు తెచ్చి రాష్ట్రం మొత్తంలో సీట్లు కి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన ఏకైక సంస్థ డాక్టర్స్ మెడికల్ అకాడమీ, ఖమ్మం అని మన ప్రాంత వాసులందరూ గర్వంగా అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ర్యాంకర్లని ఘనంగా సత్కరించారు. ఈ ఫలితాలు హర్షదాయకం అని కళాశాల యాజమాన్యం రాయల సతీస్ బాబు, ఈగా భరణి కుమార్ లు ఈ సంధర్భంగా గుర్తు చేసారు. విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్ళకుండా, వ్యయ, ప్రయాసాలు పడకుండా మన ఖమ్మంలోనే అందరికి అత్యుత్తమమైన విద్యను అందించాలనే ప్రయత్నం విజయవంతమైనది అని తెలపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులనకు, శ్రేయోభిలాషులకు అధ్యాపక బృందానికి మరియు అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్బంలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించారు.

## డిగ్రీ అడ్మిషన్లు మూడవ దశ 'దోస్త్' ప్రక్రియ ప్రారంభం

- ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పరంజ్యోతి

నేలకొండపల్లి, జూన్ 15 (మనం న్యూస్): బిఏ, బి.ఎస్సీ, బి.కామ్ వంటి కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడవ దశ విడుదల అయిందని నేలకొండపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పరంజ్యోతి తెలిపారు. ఈ ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల పది ఎకరాల స్థలంలో అన్ని వసతులతో కూడిన విశాలమైన భవన సముదాయం మరియు ల్యాబ్స్, అత్యంత అనుభవం కలిగిన అధ్యాపక బృందం కలదని తెలియజేసినారు.కళాశాల ఆవరణలోనే రూసా నిధులతో 5 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన 100 పడకల బాలుర మరియు 100 పడకల బాలికల హాస్టల్ వసతి సదుపాయం ఈ విద్యా ప్రారంభం అయిందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్యామ్ ప్రసాద్ , మూడవ దశ దోస్త్ ప్రక్రియ జూన్ 19 వ తేదీ వరకూ రూ.425 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. దోస్త్ ప్రక్రియ నమోదు కొరకు విద్యార్థి ఆధార్ కు లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్ కార్డ్, పదవ తరగతి మెమో, ఇంటర్ మెమో, ఆరు నుండి ఇంటర్ వారికీ స్టడీ సర్టిఫికెట్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, మీసేవా కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం 01-04- 2024, తర్వాత తీసుకున్నది మాత్రమే చెల్లుబాటు అవుతుంది తెలిపారు. కళాశాలలో దోస్త్ ఆన్ లైన్ సేవలు ఉచితంగా చేయబడునని, మరిన్ని వివరాలకు 9885079090,9550272092 లేదా కళాశాలను సంప్రదించగలరని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. బి.వేంకటేశ్వర రెడ్డి, రూసా కోఆర్డినేటర్ డాక్టర్. ఎన్. శ్రీనివాస్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# చట్ట సభల్లో యాదవులకు ప్రాధాన్యత దక్కించుకునే వరకు ఉద్యమిద్దాం



మెట్ పల్లి,జూన్ 15 (మనం న్యూస్)ః చట్టసభల్లో యాదవులకు ప్రాధాన్యత దక్కించుకునే వరకు ఉద్యమిద్దామని. యాదవ సంఘం అడ హాక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మెట్ పల్లి డివిజన్ ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యామాపూర్ గ్రామాల యాదవ సంఘాల సమావేశం. వేముల పూర్తి సంఘ భవనంలో జరగగా. ఈ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అత్యధిక జనాభా ఉన్న కులాల్లో రాష్ట్రంలోనే రెండవ స్థానంలో ఉన్న యాదవులకు. జనాభా దమాషా ప్రకారం చట్ట సభల్లో యాదవులకు ప్రాధాన్యత దక్కే వరకు. యాదవులందరం కలిసి కట్టుగా ఉద్యమిద్దామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మ్యాదరవేని రామంజనేయులు యాదవ్, ముక్కెర లింబాద్రి యాదవ్, బర్మ రమేష్ యాదవ్ లతో కలిసి సభ్యత్వ నమోదుతో సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం,న్యాయంగా యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన తదితర విషయాలు చర్చించారు. అనంతరం వెముల కుర్తి, యామపూర్ గ్రామాల యాదవ సంఘ సభ్యులు మొత్తం 66 మంది సభ్యత్వం తీసుకోగ వారికి ఇంచార్జిలతో కలిసి సభ్యత్వ రసీదులందించరు. ఈ కార్యక్రమంలో వెముల కుర్తి- యామపూర్ సంఘ పెద్ద మనుషులు సభ్యులు ఎస్కిల శ్రీనివాస్, బాస మల్లేష్, అందుగుల సుభాష్, బర్మ గంగాధర్, చిలివేరి మహేష్, అందుగుల నాగేష్, బాస మల్లేష్, దయానంద్, పల్లెమీది నర్సయ్య, మల్లిఖార్జున్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను గౌరవించాలిః ఎమ్మెల్యే జారె



దమ్మపేట, జూన్ 15 (మనం న్యూస్) :ఫాథర్స్ డే సందర్భంగా అశ్వారావుపేట, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, తన తండ్రి సత్యనారాయణ, కి శుభాకాంక్షలు తెలియజేసి ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాన్న అనేది కేవలం ఒక బంధం మాత్రమే కాదని మార్గదర్శకుడని పేర్కొన్నారు. నా జీవితానికి బలమైన పునాది వేసి నన్ను ఈ స్థాయికి నడిపించిన మా నాన్న కృషి మరువలేనిదన్నారు.ఈ రోజు నేను ప్రజాసేవలో ఉన్నానంటే ఆయన విలువలే నాకు దారి చూపించాయన్నారు. పిల్లలుగా తల్లిదండ్రులకు సేవ చేయడం మన మొదటి బాధ్యత అని వారికోసం ఈ ఒక్కరోజు ప్రత్యేకంగా జరుపుకోవడం కాకుండా ప్రతిరోజూ తల్లిదండ్రులను గౌరవించాలని ఆయన సూచించారు.

# ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

### భారీ ఎత్తున రక్తదాన శిబిరం



ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలను జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య ప్రారంభించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో టి పి సి సి సభ్యులు జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు కూరపాటి కిషోర్ తదితర యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు రక్తదానం చేసినారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజి శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్,కార్పొరేటర్లు దుద్దుకూరి వేంకటేశ్వరరావు,లకావత్ సైదులు నాయక్, రాపర్తి శరత్ కుమార్, కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ , మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు శ్రేణులతో కలిసి కేక్ కటింగ్ చేసి,మిఠాయిలు పంచి సంబురాలు చేసినారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ రషీద్,మద్దినేని రమేష్,నూకరపు వేంకటేశ్వరరావు, కమతం రామకృష్ణ, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, గజ్జి సూర్యనారాయణ,నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నగర మైనారిటీ అధ్యక్షులు షేక్ అబ్బాస్ భేగ్, మాజి యం పి టి సి నల్లమోతు లక్ష్మయ్య,యూసఫ్, రజ్జీ,మహమూద్, మున్నా, జహీర్ భాయ్, సాదే శంకర్, యాసబోయిన శ్రీశైలం, బెజ్జం గంగాధర్, జాని, గోపాల్ , ముజాహిద్దీన్, రమణ, విప్లవ కుమార్ పటేల్, గడ్డం వెంకటయ్యా, చల్లా ప్రతిభారెడ్డి, కొత్తపల్లి పుష్ప,ఊరుకొండ చంద్రిక, భవాని, నీలవేణి, బలుసు లక్ష్మీ, సుగుణ, కె సుగుణ, నీలవేణి,నల్లమోతు రవి, జ్యోతి, రమాదేవి తదితర నాయకులు పాల్గొన్నారు.

## సహాయనిధి పథకం సరళతరం చేయాలి

- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- 84మంది లబ్ధిదారులకు రూ.32.25 లక్షల విలువచేసే చెక్కులు అందించిన ఎమ్మెల్యే



కొత్తగూడెం, జూన్ 15(మనం న్యూస్)ః అత్యవసర పరిస్థితిలో సొంత ఖర్చులతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేద వర్గాలకు ప్రభుత్వం ద్వారా అందించే ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ప్రతి ఒక్కరు అందుకునేవిధంగా సులభతరం చేయాలని, పథకం అమలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్న 84మంది లబ్ధిదారులకు రూ.32.25లక్షల విలువచేసే చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అయన అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో 1505మందికి రూ.3.16కోట్ల విలువచేసే చెక్కులు అందించామని, 800 మందికి పంపిణీ కావాల్సివుందన్నారు. మరో 310మంది రోగులకు నిమ్స్ ఆస్పత్రి ఎల్వోసీ ద్వారా ముందస్తు వైద్య ఖర్చులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. సిఎంఆర్ఎఫ్ దరఖాస్తుదారులు కొన్ని ఆస్పత్రులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రాథమిక ఆమోదం విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలకు ఈ పథకంపై ఎలాంటి అవగాహన లేకపోవంతో దరఖాస్తుదారులు నష్టపోవాల్సి వస్తోందని, వీరిపై ప్రభుత్వం చర్యాలకు సిఫారసు చేయాలని కోరారు. నిధి మంజూరులో ప్రభుత్వం పరిమితి విధించడం సరికాదని తక్షణమే పరిమితి ఎత్తివేసి పూర్తి బిల్లును చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, వి పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, నాయకులు యూసుఫ్, ధర్మరాజు, రామారావు, అప్పారావు, కూచిపూడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

# కగార్ దాడికి నిరసనగా 20న బంద్

- ప్రభుత్వ దమనకాండను ఖండించండి
- మావోయిస్టుపార్టీ అధికార ప్రతినిధి జగన్

చర్ల, జూన్ 15 (మనం న్యూస్): ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా జూన్ 20 వ తేదీన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బంద్ పాటించాలని మావోయిస్ట్ పార్టీ తెలంగాణా రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 45 ఏళ్ల సుదీర్ఘ విప్లవోద్యమ అనుభవం కలిగిన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంట లక్ష్మి నరసింహచలం అలియాస్ సుధాకర్ అలియాస్ గౌతమ్, 30 ఏళ్ల విప్లవోద్యమ అనుభవం కలిగిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆడేల్ అలియాస్ భాస్కర్ తో పాటు ఏడుగురిని క్రూరంగా ఎన్కౌంటర్ చేసిన ప్రభుత్వ దమన కాండను తీవ్రంగా ఖండించాలని కోరారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ హిందూ ఫాసిస్ట్ ప్రభుత్వం 2026 మార్చి నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని ప్రకటించి, 2024 జనవరి నుండి ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలన్నింటిలో తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తూ నరసంహారాలను చేస్తోందని ఆరోపించారు. ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఏకైక లక్ష్యంతో అటవీ ప్రాంతంలోని ఆదివాసీలపై, వారికి అండగా ఉండే మావోయిస్టు పార్టీపై వరుస దాడులు చేస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 550 మందికి పైగా ఎన్కౌంటర్లలో కాల్చి చంపారని వెల్లడించారు. మే 21వ తేదీన మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ తో పాటు 27 మందిని పొట్టని పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ మూడో తేదీ నుండి నేషనల్ పార్క్ లో మరొక దాడిని నిర్వహించి ఏడుగురిని హతమార్చారని వెల్లడించారు. జూన్ 3 వ తేదీ నుండి 9వ తేదీ వరకు వారం రోజులపాటు నేషనల్ పార్క్ ఏరియా అంతట కూంబింగ్ నిర్వహిస్తూ వేల సంఖ్యలో బలగాలు చుట్టుముట్టి పెద్ద ఎత్తున అడవిని జల్లెడ పట్టాయని తెలిపారు. అన్నాపూర్ గుట్టలపై జూన్ 4వ తేదీ బలగాలు మొహరించి చుట్టుముట్టి దాడికి పూనుకున్నాయన్నారు. అదే రోజు రాత్రి చిమ్మ చీకటిలో దళం రిట్రీట్ అవుతున్నప్పుడు సుధాకర్ దారి తప్పి తమ వారితో విడిపోయారని తెలిపారు. జూన్ 5వ తేదీన ఉదయం 9 నుండి 10 గంటల మధ్య ఒంటరిగా ఉన్న సుధాకర్ అలియాస్ లక్ష్మీనరసింహను పోలీసులు చుట్టు ముట్టడంతో వారితో పోరాడుతూ అమరుడయ్యారని వెల్లడించారు. సుధాకర్ పశ్చిమగోదావరి జిల్లా సత్యవేల్ గ్రామంలో జన్మించి విజయవాడ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీలో చదువుతూ ఆర్ ఎస్ యూలో చేరి విప్లవబాట పట్టారన్నారు. అప్పటినుండి నేటి వరకు వివిధ హోదాలను చేపట్టినట్లు తెలిపారు. 2004 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో మావోయిస్టు పార్టీ చర్చలు జరిపినప్పుడు సుధాకర్ పేరుతో మావోయిస్టు పార్టీ ఏవోబి ప్రతినిధిగా పాల్గొన్నారని లేఖలో గుర్తు చేశారు. 2009 నుండి అమరుడయ్యే వరకు క్రాంతి పత్రిక సంపాదకుడిగా, రాజకీయ గురువుగా తన సేవలను అందించారని పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన పెద్ద కాక్లేర్ గ్రామ సమీపంలో ఉన్న మరొక దళంపై భద్రత బలగాలు దాడి చేసినప్పుడు వారితో పోరాడుతూ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ అమరుడయ్యారన్నారు. భాస్కర్ పేద దళిత రైతు కుటుంబంలో పుట్టి పెరిగి ఇంటర్మీడియట్ చదివాడని తెలిపారు. 1995లో పార్టీలో పూర్తి కాలం కార్యకర్తగా చేరారని తెలిపారు. 2015లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికైనట్లు వెల్లడించారు. జూన్ 6, 7 తేదీలలో నేషనల్ పార్టీ ఏరియా కమిటి సభ్యురాలు రైనీ, కొమరం భీమ్ డివిజన్ కి చెందిన సభ్యులు సంతోష్, రజిని, నేషనల్ పార్క్ ఏరియా 2 పిఎల్ సభ్యుడు లాల్సు, ఇరుపగుట్ట గ్రామస్తుడు కుడియం మహేష్ లను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారని లేఖలో ఆరోపించారు. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరుస దాడులు చేయడంతో పాటు పార్టీ నాయకత్వాన్ని నిర్మూలిస్తూ మరోవైపు శాంతి చర్చల నాటకమాడుతోందన్నారు. గతంలో చర్చల ప్రతినిధిగా వచ్చిన సుధాకర్ ను కూడా చంపిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న బూటకపు చర్చల నాటకాన్ని ఎండ గడుతూ కగార్ దాడులకు వ్యతిరేకంగా జూన్ 20వ తేదీన ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో బందు పాటించాలని జగన్ లేఖలో విజ్ఞప్తి చేశారు.

# జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కే అధిక ప్రాధాన్యత ఇచ్చారు

## ఆసీస్ ఓటమిపై మండిపడ్డ మాజీ




ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఆస్ట్రేలియా ఓటమి పాలైంది. దీంతో వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ గదను అందుకోవాలనుకొన్న ఆ టీమ్‌కు నిరాశే ఎదురైంది. ఈ ఓటమి నేపథ్యంలో ఎక్కడ పొరపాట్లు జరిగాయే ఆ జట్టు మాజీ ఆటగాళ్లు విశ్లేషిస్తున్నారు. ఆ జట్టు మాజీ మిచెల్ జాన్సన్ ఒక అడుగు ముందుకేసి పలువురు ఆటగాళ్ల తీరుపై మండిపడ్డాడు. జట్టు ప్రయోజనాలకంటే.. ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించాడు.మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్‌తో కూడిన బౌలింగ్ 'బిగ్ ఫోర్' విఫలమైందని మిచెల్ జాన్సన్ అభివర్ణించాడు. ముఖ్యంగా హేజిల్‌వుడ్ తీరుపై తీవ్ర విమర్శలు చేశాడు. ''ఇటీవల కాలం హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అతడు జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వాయిదా పడ్డ అనంతరం ప్రారంభమైన ఐపీఎల్‌కు తిరిగి వెళ్లాలన్న అతడి నిర్ణయం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక లైయన్ వికెట్లు తీయడంలో విఫలమయ్యాడు'' అని విమర్శించాడు.

# అదే నాలో స్ఫూర్తి నింపింది.. ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసింది: మార్‌క్రమ్




డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది దక్షిణాఫ్రికా. 27 ఏళ్ల అనంతరం ఆ జట్టు ఐసీసీ టైటిల్‌ను గెలిచింది. ఈ విజయం ఆ జట్టు ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఎంతో భావోద్వేగంతో కూడినదే. చివరి దాకా వచ్చి.. ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న ఆ జట్టు ఈ సారి మాత్రం పట్టువిడవలేదు. ఆ జట్టు విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచిన మార్‌క్రమ్ కూడా అదే చెప్పాడు. ఈ సారి టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదనే లక్ష్యంతో ఆడినట్లు వెల్లడించాడు. గత టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియాపై ఓటమి దక్షిణాఫ్రికాను తీవ్రంగా కుంగదీసిన విషయం తెలిసిందే. అప్పుడు తాను ఔట్ అయిన తర్వాత.. ఎంతో నిరాశకు గురయ్యానని.. మళ్లీ అలాంటి ఫీలింగ్ ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో రాకుడదని కోరుకున్నానని మార్‌క్రమ్ తెలిపాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని.. వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసిందని పేర్కొన్నాడు.తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగన మార్‌క్రమ్.. రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ''డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించాను.

# గిల్ ఎక్కడ మెరుగవ్వాలంటే..? గంగూలీ సూచనలివే..

ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ నేతత్వం వహిస్తుండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అయితే.. కెప్టెన్‌గా గిల్ కొత్త పాత్ర, ఎదురయ్యే సవాళ్లపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విశ్లేషించాడు. తన కెప్టెన్సీ హయాంలో ఎంతో మంది యువ ఆటగాళ్లను ప్రోత్సహించిన గంగూలీ.. శుభ్‌మన్ గిల్ సామర్థ్యాలపై విశ్వాసం వ్యక్తం చేశాడు. అయితే, అదే సమయంలో పలు సూచనలు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో సాంకేతికంగా మెరుగవ్వాలని పేర్కొన్నాడు. ''గిల్‌కు ఆల్ ది బెస్ట్. టెస్టుల్లో అతడు బాగా రాణిస్తాడన్న నమ్మకం ఉంది. అతడు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. ఇక జట్టులో సీనియర్లు అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రహానె లేరు. టీమ్‌ఇండియాలో పరిస్థితులు మారిపోయాయి'' అని దాదా పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌లో సవాల్ విసిరే పరిస్థితుల్లో గిల్ కెప్టెన్‌గానూ, బ్యాటర్‌గానూ రాణించాలన్నాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ''ఇంగ్లండ్‌లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్న పరిస్థితుల్లో గిల్ ఎక్కువ పరుగులు సాధించాలి. కొత్త బంతితో ఆడటం ఆరంభంలో కష్టంగానే ఉంటుంది. 100/2 లేదా 20/4.. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది. సరైన డిఫెన్స్ ఎంచుకోవాలి. ఆఫ్ స్టంప్ ఆవల పడ్డ బంతులను ఎలా వదిలేయాలో నేర్చుకోవాలి'' అని గంగూలీ సూచించాడు. ఇంగ్లండ్‌లోని పిచ్‌లపై ఫ్రంట్ ఫుట్ అప్రోచ్‌ను మెరుగుపరుచుకోవాలని గంగూలీ సూచించాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో పని చేసే బ్యాక్ ఫుట్ అప్రోచ్‌కు ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉంటాయని వివరించాడు. ఇక ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 20 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లీడ్స్ వేదికగా జరగనుంది.





## అవార్డుల వేడుకలు

# మిస్ అవ్వొద్దు

### చిత్ర పరిశ్రమకు దిల్‌రాజు సూచన

ప్రభుత్వాలు నిర్వహించే సినిమా వేడుకకు తప్పనిసరిగా హాజరుకావాలని చిత్ర పరిశ్రమకు ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు సూచించారు. 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం శనివారం జరిగిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి కతజ్ఞతలు చెప్పేందుకు దిల్ రాజు తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు.''తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక నిన్న గ్రాండ్‌గా జరిగింది. ఆ విషయంలో ఆనందంగా ఉంది. దాని కోసం ఆరు నెలలుగా వర్క్ చేశాం. ఈ పురస్కారాలకు సంబంధించి కొన్ని నియమ, నిబంధనలు ఉన్నాయి. ముందుగా 2024 చిత్రాలకే అవార్డులు ఇవ్వాలన్నది ప్లాన్. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన ఏడాది నుంచీ ఇస్తే బాగుంటుందని పలువురు సూచించారు. ఆ మేరకు ఓ కమిటీ ఏర్పాటైంది. 2014 నుంచి 2023 వరకూ ఏడాదికి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం కష్టమైన పని. వేడుకలో పాల్గొన్న వారందరికీ కతజ్ఞతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు. సీఎం ఒక గంట కేటాయించారు. కానీ, ప్రోగ్రామ్ ప్లానింగ్ నాలుగున్నర గంటలుగా ఉంది. అందుకే రేవంత్ గారు వేడుకకు వచ్చాక.. పరిస్థితి వివరించి, ఇంకా ఎక్కువ సమయం ఉండాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశా. 'ఎంతసేపు ఉండాలి?' అని అడిగారు. పూర్తయ్యే వరకూ ఉంటే చాలా హ్యాపీ సర్ అని చెప్పా. అలా 2:15 గంటల పాటు అక్కడ ఉన్నారు. సీఎం చేతుల మీదుగా అవార్డులను అందుకున్న వారంతా చాలా ఆనందంగా ఉన్నారు. ఈ పురస్కారాల వేడుక విషయంలో మాకు మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు'' ''త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇస్తుంది. ప్రభుత్వం నుంచి అవార్డులు వస్తున్నాయంటే.. చాలా జాగ్రత్తగా వాటిని స్వీకరించాలి. ఎక్కడున్నా, షూటింగ్‌తో బిజీగా ఉన్నా రావాలి. ప్రభుత్వంతో ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వారందరిదీ.



# మాళవిక మోహనన్‌కు చేదు అనుభవం..



తంగలాన్ బ్యూటీ మాళవిక మోహనన్ ప్రస్తుతం ప్రభాస్ సరసన నటిస్తోంది. మారుతి డైరెక్షన్‌లో వస్తోన్న ది రాజాసాబ్‌లో కనిపించనుంది. మలయాళం, తమిళ చిత్రాలతో ఫేమ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ టాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇప్పటికే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూకు హాజరైన మాళవిక మోహనన్ తనకెదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. ముంబయి లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న సమయంలో ఓ వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపింది. తన స్నేహితులతో కలిసి రాత్రి సమయంలో లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తుండగా కంపార్ట్‌మెంట్ వద్ద ఉన్న గ్లాస్ డోర్ నుంచి ఓ వ్యక్తి తమవైపే చూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని తెలిపింది. ఆ సమయంలో తీవ్ర భయాందోళనకు గురైనట్లు మాళవిక పంచుకుంది. ముంబయి లాంటి నగరంలో మహిళల భద్రత లేదని నటి మాళవిక మోహనన్ తెలిపింది.అయితే ఈ వార్త చూసిన ముంబయి పోలీసులు ఆమె జరిగిన ఘటనపై స్పందించారు. మాళివిక గారు మేము మీ గురించి వార్తల్లో చూశాం.. మీకెదురైన అనుభవాన్ని పంచుకున్నారు. నగరంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అనుభవాలు ఆశ్చర్యకరంగా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. నగరంలో రోజులో ఏ సమయంలో లేదా ఏ ప్రదేశంలోనైనా.. దయచేసి 112 లేదా 100 నంబర్‌లో మమ్మల్ని సంప్రదించండి. మేము వీలైనంత త్వరగా మీకు అండగా నిలుస్తామని తెలిపారు.ముంబయి పోలీసులు తమ పోస్ట్‌లో రాస్తూ..'ముంబై నగరం ఎల్లప్పుడూ మహిళలకు సురక్షితంగా ఉంటుంది. భద్రత మరింత మెరుగుపరచడానికి మేము ఎలాంటి చర్యలకైనా సిద్ధం. నేరస్థుడిని తగిన విధంగా.. చట్టబద్ధంగా శిక్షిస్తాం. దయచేసి మీ పేరును ఉపయోగించి ఈ విషయాన్ని వ్యాప్తి చేయండి. ఇలాంటి సమస్యలను పరిష్కరించడంలో బాగా సహాయపడుతుంది.' అని విజ్ఞప్తి చేశారు.

# ప్రభాస్ 'ది రాజాసాబ్' టీజర్.. టైమ్ ఫిక్స్ చేసిన టీమ్

ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూస్తున్న తరుణం రాబోతోంది. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఈ క్రమంలో చిత్ర నిర్మాణ సంస్థ టీజర్ అప్‌డేట్‌ను ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే. జూన్ 16న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇప్పుడు సమయాన్ని కూడా ప్రకటించింది. జూన్ 16, ఉదయం 10.52గంటలకు టీజర్‌ను విడుదల చేయనున్నట్లు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ తెలిపింది. ప్రభాస్ సరికొత్త అవతార్‌లో కనిపించనున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.



# బయోపిక్‌లో శ్రద్ధ?



'స్త్రీ' సినిమాలతో సినీప్రియుల దష్టిని ఆకర్షించింది బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్. ఈ హారర్ చిత్రాల్లో ప్రేక్షకుల్ని పరుగులు పెట్టించిన ఈ భామకు ప్రస్తుతం అవకాశాలు వరుస కడుతున్నాయి. ఇందులో భాగంగానే 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో శ్రద్ధ నటిస్తున్నట్లు కొన్నిరోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టు గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తోంది. జానపద ప్రపంచంలో తనదైన ముద్రవేసిన మహారాష్ట్ర గాయని, నత్యకారిణి విఠాబాయి నారాయణ్ గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ''ఈ బయోపిక్ కేవలం ఒక నర్తకి గురించి మాత్రమే కాదు.. ఈ పురుషాధిక్య ప్రపంచంలో సరిహద్దులను చెరిపేసి రాబోయే తరాలకు జానపద కళల గురించి తెలియజేసిన ఒక గొప్ప మహిళ గురించి'' అని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# పెదరాయుడు @ 30 ఏళ్లు

భార్యాభర్తల బంధం, అన్నదమ్ముల అనుబంధం గురించి తెలుగు తెరపై ఆవిష్కతమైన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'పెదరాయుడు' ఒకటి. రవిరాజా పినిశెట్టి దర్శకత్వంలో మోహన్‌బాబు, రజనీకాంత్ కీలకపాత్రల్లో నటించిన ఈ చిత్రం విడుదలై నేటితో 30 ఏళ్లు అయింది. పాపారాయుడుగా రజనీకాంత్ అద్భుత నటన, పెదరాయుడుగా మోహన్‌బాబు యాక్షన్, పవర్‌ఫుల్ డైలాగులు, భానుప్రియ, సౌందర్య అభినయం, కోటి అందించిన సంగీతం.. ఇలా చెబుతూ వెళ్తే ఈ సినిమాలో ఎన్నో విశేషాలు.

### తమిళనాడులో పుట్టిన కథ..!!

కోలీవుడ్‌లో తెరకెక్కిన 'నట్టమై' చిత్రానికి రీమేక్‌గా తెలుగులో 'పెదరాయుడు' విడుదలైంది. శరత్‌కుమార్ కథానాయకుడిగా 1994లో వచ్చిన 'నట్టమై' మంచి విజయాన్ని సాధించింది. అయితే, ఆ సినిమా చూసిన తర్వాత ఓ రోజు రజనీకాంత్.. మోహన్‌బాబుకి ఫోన్ చేసి 'నట్టమై' చూడమని, ఆ కథను తెలుగులో తెరకెక్కిస్తే విజయం సాధిస్తుందని తెలిపారు. స్నేహితుడి మాట మేరకు మోహన్‌బాబు వెంటనే ఆ చిత్రాన్ని చూసి కాపీ రైట్స్ కొనుగోలు చేశారు. అలా 'పెదరాయుడు' చిత్రానికి తొలి అడుగు పడింది.

### దర్శకుడిగా రవిరాజా..!!

'ఎమ్.ధర్మరాజు ఎం.ఏ' చిత్రం తర్వాత మోహన్‌బాబు, రవి రాజా పినిశెట్టి కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రమే 'పెదరాయుడు'. కాపీరైట్స్ కొనుగోలు చేసిన అనంతరం ఈ కథకు రవిరాజా అయితే సరైన న్యాయం చేయగలరని మోహన్‌బాబు భావించారు. అలా 'పెదరాయుడు' డైరెక్షన్ రవిరాజాని వరించింది. నటీనటుల సంభాషణలు, హావభావాలు తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యే విధంగా కథలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు దర్శకుడు. ప్రతి




సన్నివేశంలో కుటుంబ విలువలను చక్కగా చూపించారు. పాపారాయుడుగా రజనీకాంత్, పెదరాయుడుగా మోహన్‌బాబు అతని భార్య లక్ష్మిగా భానుప్రియ, పెదరాయుడు తమ్ముళ్లుగా మోహన్‌బాబు (రాజా), రాజా రవీంద్ర (రవీంద్ర) మెప్పించారు. అలాగే రాజా సతీమణిగా ధనవంతురాలైన అమ్మాయిగా సౌందర్య (భారతి) నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

### కదిలించిన సంగీతం..!!

కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాలో నేపథ్య సంగీతానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. 'బావవి నువ్వు భామని నేను' అనే ప్రేమ గీతం, 'కదిలే కాలమా' అనే భావోద్వేగ భరితమైన పాట.. ఇలా ప్రతీది సూపర్ హిట్టే. కోటి అందించిన స్వరాలకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. సౌందర్య సీమంతం నేపథ్యంలో సాగే 'కదిలే కాలమా' అనే పాట మోహన్‌బాబు అభిరుచికి నిదర్శనం. ఎందుకంటే ఆయనే కావాలని ఆ పాటను సినిమాలో పెట్టించారు. సినిమా విడుదలయ్యాక ప్రతి తెలుగింటిలోనూ ఈ పాట వినిపించింది.

### పారితోషికం లేకుండా..!!

అన్నదమ్ముల అనుబంధం గురించి తెలియజేసే ఈ కథలో పెదరాయుడు నాన్న పాపారాయుడి పాత్ర కీలకమైనది. సినిమాలో ఈ పాత్ర నిడివి తక్కువ సమయమే అయినా కథకు మూలమిదే. మోహన్‌బాబు కాపీరైట్స్ కొనుగోలు చేసిన తర్వాత 'పాపారాయుడు' పాత్ర తాను చేస్తానని రజనీకాంత్ తెలిపారు. నిడివి చాలా తక్కువ ఉంటుంది కదా వద్దు అని చెప్పినా సరే.. ఆయన మాత్రం ఆ పాత్రలో ఒదిగిపోయారు. అయితే, పాపారాయుడిగా నటించినందుకు ఆయన ఎలాంటి పారితోషికం తీసుకోలేదు.

# బనకచర్ల ప్రాజెక్టును నిలిపేయాలి

**వరద మిగులు జలాల పేరుతో తెలంగాణ నికరజలాల దోపిడీ**

**అధికారాన్ని కాపాడుకోవడానికి కేంద్రం ఆంధ్రకు వత్తాసు**

**చోద్యం చూస్తున్న బీజేపీ తెలంగాణ నాయకత్వం**

**బనకచర్లను ప్రాజెక్టు నిలిపివేతకు పోరాటానికి**

**రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి**




**సూర్యాపేట, జూన్ 15 (మనం ప్రతినిధి):** గోదావరి నది మిగులు జలాలు, వరద జలాల పేరుతోటి తెలంగాణ నికర జలాలను కొల్లగొట్టడం కొరకే ఆంధ్ర ప్రదేశ్ బనక చర్ల ప్రాజెక్టును రూపొందించిందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్టు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నీ తెలంగాణ జన సమితి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆంధ్ర నాయకత్వం కృష్ణ ,గోదారి నదులపై అడ్డగోలుగా ప్రాజెక్టు నిర్మాణం చేసుకొని తెలంగాణకు రావలసిన నీళ్లు రాకుండా దోచుకెళ్లారని మళ్లీ ఇప్పుడు అదే తంతు మొదలు పెట్టారని దాని కొనసాగింపే గోదావరి నది నుండి 200 టీఎంసీల నీళ్లను కొలగొట్టడానికి బనకు చర్ల ప్రాజెక్టు అన్నారు. గోదావరి నది తెలంగాణ ప్రాంతంలో 79% ప్రవహిస్తుండగా ఆంధ్రాలో 21% భూభాగంలో మాత్రమే ప్రవహిస్తుంది. ఈ లెక్కల ప్రతికారము తెలంగాణకు 1179 టీఎంసీల నీళ్లు వాడుకునే అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర నాయకత్వం చేసిన ద్రోహం తెలంగాణ నాయకత్వం వైఫల్యం మూలంగా కేవలం 400 నుండి 500 టీఎంసీలు మాత్రమే వాడుకోవడం జరుగుతుంది అని తెలిపారు.కానీ గోదావరి నది ఆంధ్రాలో ప్రవహించే భూభాగాన్ని ప్రకారం 310 టీఎంసీలు నీళ్లు మాత్రమే వాడుకోవాల్సి ఉండగా ఇప్పటికే 684 టీఎంసీల నీటిని వాడుకుంటున్నారు మళ్ళీ ఇప్పుడు మిగులు జలాల పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారని ఇది తెలంగాణ నీటి వాటకు నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటికి తెలంగాణ పట్ల చిన్నచూపు చూస్తూ సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందని విమర్శించారు. కృష్ణ గోదావరిలో తెలంగాణ వాట తేల్చకుండానే ఇక్కడున్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండానే ,పెండింగ్ ప్రాజెక్టులు అనుమతి ఇవ్వకుండా, గెజిట్ ని తీసుకొచ్చి మొత్తం జలాల పై తన యాజమానిషిని ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ నిర్మించి తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం నిలిపియ్యకపోవడం ప్రభుత్వం యొక్క ధోరణి అర్థమవుతుందని వెల్లడించారు. మరి తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకత్వం ఏం చేస్తుందని ఆయన నిలదీశారు. బి ఆర్ఎస్ నాయకులు నేడు బనకచర్ల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మీరు చేసిన ఘనకార్యం మూలంగానే ఈ పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేసినారు. ఒకరోజు రోజా పెట్టిన బిర్యాని తిని కేసీఆర్ రాయలసీమ రత్నాల సీమగా మారుస్తానని చెప్పి తెలంగాణ వ్యతిరేకి అయినటువంటి వైఎస్ జగన్ తెలంగాణ ప్రగతి భవన్ లో ఎర్రతి వాచీలు పరిచి నదుల సంధానం పేరుతో కొత్త నాటకానికి తెర ఎత్తారని తన రాజకీయ స్వార్థం కొరకు తెలంగాణ ప్రజలను నట్టేట ముంచాడని విమర్శన హస్త్రాలు. గుప్పించారు. నాడే జగన్, కేసీఆర్ లు నదుల అనుసంధానం పేరుతో చేసుకున్న ఒప్పందాల్లో రహస్య వడంబడిటగా బనకచర్ల ఉన్నది అనే వాస్తవం ఇప్పుడు మనకు అర్థమవుతోంది ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని గగ్గోలు పెడుతున్నారని ఆరోజు కేంద్ర ప్రభుత్వం జలాల మీద గెజిటెడ్ తీసుకొచ్చినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు ఆరోజు అఖిల పక్షాన్ని ఎందుకు ఢిల్లీకి తీసుకు వెళ్లలేదు అని నిలదీశారు .ఇప్పటికైనా టిఆర్ఎస్ బిజెపి నాయకులు రాజకీయ పబ్బం గడుపుకోకుండా తమ తప్పిదాలను ఒప్పుకొని ప్రజల ముందు క్షమాపణ చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ఆపడానికి చేయాల్సిన అన్ని రకాల పోరాటాలను చేయాలని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం కొరకు కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడకూడదు కొరకు కలిసి అన్ని శక్తులతో కలిపి తెలంగాణ జన సమితి బనకచర్ల ప్రాజెక్టు వ్యతిరేక పోరాటాన్ని తీరం చేస్తుందని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమా శంకర్, కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ధరావత్ వీరేష్ నాయక్, డిఎల్ సెల్ జిల్లా కార్యదర్శి బొజ్జ అనిల్ పాల్గొన్నారు.



## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి

- **పదివేల నగదు బహుమతిని అందించిన హెడ్ కానిస్టేబుల్ దంపతులు**
- **దంపతులను సన్మానించిన గ్రామస్తులు, ఉద్యోగులు**

**పెన్ పహాడ్, జూన్ 15 (మనం న్యూస్):** గ్రామానికి చెందిన విద్యార్థిని పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ దంపతులు రూ.10000 నగదు ప్రోత్సాహక బహుమతిని అందించి ఉన్నతంగా చదువుకోవాలని ప్రోత్సహించారు వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని దూపహడ్ గ్రామానికి బొల్లెపల్లి నాగార్జున మమత దంపతుల కుమార్తె బొల్లెపల్లి నిఖిల ప్రతిరోజు గ్రామం నుండి వెళ్లి గరిడేపల్లి మండలం గడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకుగాను గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యాపేటలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన బోయిళ్ళ అరవిందు శ్యామల దంపతులు పదివేల రూపాయల నగదు ప్రోత్సాహ బహుమతిని అందించారు ఈ సందర్భంగా దాత అరవింద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి గ్రామంలో ఎక్కువ మార్కులు సంపాదించిన ఒకరికి ఈ బహుమతిని అందిస్తామని తెలిపారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నతంగా ఎదగాలని గురువులకు, గ్రామానికి, వారి తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని కోరారు అనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థిని నిఖిలకు,దాత అరవిందు శ్యామల దంపతులకు ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉద్యోగస్తులు, విద్యావేత్తలు, యువతి, యువకులు, మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పెన్ పహాడ్ జూన్ 15 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999--2000 బ్యాచ్ కి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారంతా చిన్ననాటి స్నేహితులు 25 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్నారు ఎస్ ఎస్ సి బ్యాచ్ కు చెందిన సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న చిన్ననాటి పాఠశాల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకుంటూ.. అదేవిధంగా చిన్ననాటి మధుర స్మృతులను తలుచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు రవి, భూక్య సైదా, చామకూరి వెంకటేశ్వర్లు, వెన్న సురేష్, ఒగ్గు ఆనంద్, దండంపల్లి దేవేందర్, కర్నాటి శ్రీను, మండవ సైదులు, పానుగోతు రవి, ఊరుకొండ జ్యోతి, భవాని, ఒగ్గు లక్ష్మీ, చంద్రకళ మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను గ్రామ,గ్రామాన ఘనంగా నిర్వహించాలి

**కోదాడ,జూన్ 15(మనం న్యూస్):** మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఆదివారంనాడు నూతన గ్రామ కమిటీలను సంస్థాగతంగా బలోపేతం చేయుటలో భాగంగా, గుడిబండ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిది ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏపూరి రాజు మాదిగ,విహెచ్పిఎస్ జాతీయ నాయకులు కార్ల విజయరావు మాదిగ సమక్షంలో ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో ఉన్నటువంటి అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను అజెండాగా తీసుకొని అన్న ముందుకు పోయే ప్రయాణంలో సంస్థాగతంగా గ్రామస్థాయిలో జాతిని బలోపేతం చేయడానికి ఈ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.అలాగే



ఎమ్మార్పీఎస్ గద్దెలు లేని చోట ఏర్పాటు చేసుకొని జులై 7న జరిగే 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున మన జాతితో పాటు అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసి ఘనంగా గ్రామ,గ్రామాన పిలుపునిస్తూ,నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ చేయించడం జరిగినది అలాగే కృష్ణ మాదిగకి పద్మశ్రీ అవార్డు రావడం యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవంగా భావించాలన్నారు.30సం ఎమ్మార్పీఎస్ ఉద్యమం సాధించిన విజయాలను జాతి బిడ్డలకు ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు సూరవరపు వంశీ మాదిగ సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో పాల్గొని తెలియజేశారు.గుడిబండ ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ సభ్యులు అధ్యక్షులు, సోమపంగు గాంధీ,ప్రధాన కార్యదర్శి,పులి తిరుపతి బాబు,ఉపాధ్యక్షులు,సోమపంగు శ్రీకాంత్,పులి ప్రవీణ్,కార్యదర్శులు,పులి నాగశేకర్,సోమపంగు మహేష్,ప్రచార కార్యదర్శులు,సోమపంగు జీవన్, నూకపంగు లాజర్,సహాయ కార్యదర్శులు, నామవరపు రమేష్,పిడపర్తి బాబు,గౌరవ సలహాదారులుగా పోయిల బిక్షం,సూరవరపు మైసయ్య,సోమపంగు కనకరత్నం లను ఎన్నిక చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ కోదాడ మండలం అధ్యక్షులు పులి రాజారావు,ఎంఈఎఫ్ నియోజకవర్గ నాయకులు సోమపంగు బుల్లయ్య,ఎమ్మార్పీఎస్ కోదాడ మండల ఉపాధ్యక్షులు సూరవరపు వంశీ,పులి తిరపయ్య,పులి సుందర్రావు,సూరవరపు రంగయ్య, పులి వెంకటి,సోమపంగు కనక రత్నం,ఎమ్మార్పీఎస్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కల్నల్ సంతోష్ బాబు త్యాగం వెలకట్టలేనిది



**సూర్యాపేట, జూన్ 15 (మనం ప్రతినిధి):** దేశం కోసం ప్రాణాలకు అర్పించిన కల్నల్ సంతోష్ బాబు త్యాగం వెలకట్టలేనిది జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. ఆదివారం సంతోష్ బాబు 5వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల సంతోష్ బాబు వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమం నందు జిల్లా ఎస్పీ నరసింహ హాజరై జిల్లా పోలీస్ శాఖ తరపున కల్నల్ సంతోష్ బాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఆర్మీ జవాన్ గా విరోచితంగా పోరాడి దేశ రక్షణలో అసువులుభాషారు, వీరి త్యాగం వెలకట్టలేని దాని వీరి లోటు తల్లిదండ్రులకు, భార్య పిల్లలకు చాలా బాధ కలిగిస్తుంది పేర్కొన్నారు. అయినప్పటికీ దేశ వ్యాప్తంగా కల్నల్ సంతోష్ బాబు త్యాగాన్ని గుర్తించినివాలర్పించడం, స్మరించుకోవడం ఆ కుటుంబానికి ఓదార్పు అన్నారు. ఆదర్శంగా తీసుకుని దేశ రక్షణకు పౌరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత దేశానికి భవిష్యత్తు ఇలాంటి యువత నేడు చెడు వ్యసనాలకు గురై నిర్వీర్యం అవుతున్నారు, యువత కల్నల్ త్యాగాన్ని, ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు, ఆర్మీ జవాన్లు సంక్షేమం సంఘం, ఎన్ సీసీ విద్యార్థులు, పౌరులు, పట్టణ ప్రముఖులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దోపిడి రహిత సమాజ నిర్మాణమే సిపిఎం లక్ష్యం




- **ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**

**నల్గొండ, జూన్ 15 (మనం ప్రతినిధి):** దోపిడీ రహిత సమాజ నిర్మాణమే సిపిఎం లక్ష్యమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ పట్టణంలోని పెద్ద బండ ఎఫ్సిఐ ఫంక్షన్ హాల్ లో రెండు రోజులపాటు జరుగుతున్న సీపీఎం నల్లగొండ నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ సమాజం దోపిడీ కొనసాగిస్తూ పేదలను మరింత పేదలుగా మారుస్తున్నారని అన్నారు. అందరికీ సమాన అవకాశాలు అందాలని సిపిఎం పోరాడుతుందని అన్నారు. కేంద్రంలో బిజెపి కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని ఆరోపించారు రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని అన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు అమ్ముతూ సార్వభౌమత్వాన్ని పేదలకు కూలి, భూమి అందే వరకు, దోపిడీ అంతం అయ్యేవరకు ఎర్రజెండా ప్రజల్లో గుండెల్లో ఉంటుందని అన్నారు. ఆదివారం ఉదయం కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, మధ్యాహ్నం మతం మతోన్మాదం ప్రతిఘటన ఉద్యమాలు అనే అంశంపై పిట్టల రవి బోధించారు ఈ శిక్షణా తరగతులకు ప్రిన్సిపల్ గా సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య వ్యవహరించగా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, కొండ అనురాధ, నలగొండ తిప్పర్తి కనగల్లు మాడుగులపల్లి మండల కార్యదర్శిలు నలపరాజు సైదులు, మన్నెం బిక్షం, కానుగు లింగస్వామి పుల్లెంల శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ లైఫ్ పుస్తకావిష్కరణ చేసిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మఠంపల్లి, జూన్ 15,మనం న్యూస్:** సంతోషం లేని జీవితం ఎన్ని సంపదలు ఉన్నా పరిపూర్ణం కాదని తెలంగాణ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మైండ్ పవర్ లో ప్రపంచ రికార్డు గ్రహీత మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన టి. వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ రచయిత. జర్నలిస్ట్ విజయార్కె కలిసి రాసిన వ్యక్తిత్వ వికాస రచన హ్యాపీ లైఫ్ మీ ఆనందం మీ చేతుల్లో పుస్తకాన్ని ప్రగతి భవన్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ క్యాంప్ ఆఫీసులో తెలంగాణ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి పుస్తకాల అవసరం ఉందని, ఈ పుస్తకం జీవితంలో సంతోషాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు.సమాజానికి అవసరమయ్యే హ్యాపీ లైఫ్ పుస్తకాన్ని రాసిన రచయితలను అభినందించారు. పుస్తక రచయితల్లో ఒకరైన వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల పాటు శ్రమించి, సంతోషకరమైన జీవితానికి ఉపయోగపడే ఎన్నో అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచాం జీవితంలో కోల్పోతున్న సంతోషాన్ని మీకు ఈ పుస్తకం పరిచయం చేస్తుంది అన్నారు. రచయిత విజయార్కె మాట్లాడుతూ సంతోషం లేని జీవితం, ఆత్మ లేని దేహం లాంటిది సంతోషాన్ని మించిన సంతృప్తి లేదు.అలాంటి సంతోషకరమైన జీవితాన్ని మీకు ఈ పుస్తకం ద్వారా అందించే ప్రయత్నం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొదటి చైర్మన్ జర్నలిస్టు గంట చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సంస్థాగత నిర్మాణం కోసం కృషి చేయాలి



**హుజూర్ నగర్, జూన్ 15, మనం న్యూస్:** బిజెపి సంస్థాగత నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ అన్నారు.ఆదివారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.ప్రతి కార్యకర్త పార్టీ ఇచ్చిన ఆదేశాలను తప్పక పాటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డులో పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికార పార్టీ,సమస్యలను గుర్తించడంలో ప్రతిపక్ష పార్టీ విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం ప్రతి కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం బిజెపి పట్టణ కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించారు.పట్టణ బిజెపి కమిటీ ఉపాధ్యక్షులు పైడమర్రి విజయ్ , కొల్లోజు నాగేంద్రచారి,జనరల్ సెక్రెటరీ గుండా గోపి, కార్యదర్శులు గుగులోతు రవి,చుక్కా హరీష్, కార్యవర్గ సభ్యులు యల్లావుల సోమరాజు,పంగా రమేష్, బైరు సతీష్, బల్వంత్ సింగ్,పులి నరసింహ, బత్తుల ఉపేందర్, గుండా నాగరాజు, కామళ్ళ వంశీ,అయిల సిసింద్రీ, రంగనాథ్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి ముఖ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సేవా స్ఫూర్తి సమస్త లోకానికి ఆదర్శం

- **ఆర్యవైశ్యులకు మంత్రి ఉత్తమ్ నేను ఎంతో రుణపడి ఉంటాం.**
- **ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**

**కోదాడ, జూన్ 15 (మనం న్యూస్):** ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అగ్ర స్థానంలో నిలవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తం అన్నారు. ఆదివారం స్థానిక గుడు గుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.గత 30 ఏళ్లుగా మంత్రి ఉత్తమ్ తోపాటు తనకు ఆర్యవైశ్య సంఘాలతో విడదీయని అనుబంధం ఉందని ఆత్మీయ భావాన్ని వ్యక్తం చేశారు.తమ ఇంటి ఆడబిడ్డగా తనను ఆదరిస్తున్నారన్నారు.ఆర్యవైశ్య సేవ స్ఫూర్తి సమస్త లోకానికి ఆదర్శమని కొనియాడారు.ఆర్యవైశ్యుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానన్నారు.ఏ సమస్య ఉన్న తనను నేరుగా కలవవచ్చున్నారు.ఆర్యవైశ్య భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.వాసవి మాత ఆశీర్వాదంతో అతి త్వరలో భవన నిర్మాణానికి పనులు ప్రారంభమవుతాయన్నారు.ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రంలోనే అత్యంత బలమైన సంఘం అన్నారు.సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం సామాజిక సేవ రంగంలో అగ్రస్థానంలో నిలిచి రాష్ట్రంలో పేరుగాంచాలని,నూతన కార్యవర్గానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఆర్యవైశ్య మహాసభ జిల్లా మహిళా విభాగం మరింత చైతన్యవంతంగా ఉండాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా మహాసభ పక్షాన ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు.రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోదాడ వైశ్యులు రాజకీయ చైతన్యంలో అగ్రస్థానంలో ఉంటారని కొనియాడారు.రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్



కల్వ సుజాత మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం ద్వారా పేద ఆర్యవైశ్యులకు ఆర్థిక సహకారం అందిస్తానన్నారు.ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు.అనంతరం నూతన అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సోమనర్సయ్య,కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ తో పాటు కార్య వర్గానికి రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ,మహిళా విభాగంలో ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలుగా గరినే ఉమామహేశ్వరి,ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి,కోశాధికారిగా వెంకటలక్ష్మి తోపాటు కార్యవర్గాన్ని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉప్పల శారద,జిల్లా రాజకీయ విభాగ చైర్మన్ కక్కిరిని శ్రీనివాస్,మీడియా విభాగ చైర్మన్ వంగవీటి శ్రీనివాసరావు,ఎన్నారై విభాగం చైర్మన్ ఇరుకుల చెన్నకేశవరావు,వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు లచే ఇరుకుల్ల రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం జిల్లా యువజన సంఘం అధ్యక్షులుగా బొమ్మిడి అశోక్,ప్రధాన కార్యదర్శిగా చల్ల అశోక్,కోశాధికారిగా స్వామి గణేష్ ,ఉపాధ్యక్షులుగా డాక్టర్ భరత్ చంద్ర,ఇమ్మడి అనంత చక్రవర్తి,భరత్,సాయి,ప్రవీణ్ లచే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఊరే లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం ముఖ్య అతిథులను,నూతన కార్యవర్గ సభ్యులను,ఆర్యవైశ్య పెద్దలను ఘనంగా సన్మానించారు.కాగా జిల్లా ప్రమాణ స్వీకార మహోత్సవానికి జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్యులు తరలివచ్చారు.సభా ప్రాంగణం ఆర్యవైశ్య సోదరులతో మహిళలతో సందడిగా మారింది.జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు మా శెట్టి అనంత రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు,సంఘ నాయకులు అవోపా బాధ్యులు,వాసవి క్లబ్స్ బాధ్యులు,జిల్లా లోని వివిధ మండలాల,గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఇవాళ మానవ సంబంధాల మనుగడ ప్రమాదంలో పడింది. వ్యవస్థ ఏకమొత్తంగా సంయమనాన్ని, క్షమాగుణాన్ని, కృతజ్ఞతాభావాన్ని, విశాల దృక్పథాన్ని కోల్పోయిన కాలంలో మనం జీవిస్తున్నాం. సమాజంలో అత్యున్నత అధికార కేంద్రాలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు కూడా ఈ దురవస్థకు అతీతం కాకపోవడం శోచనీయం. పగ, ప్రతీకారాలు, విద్వేషాలు, అసహనం, అసంతృప్తి ముప్పిరిగొన్న అంధకారంలోకి మనం ప్రయాణిస్తున్నాం. కుటుంబ సంబంధాల విషయంలో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. రోజువారీ వార్తల్లో ఎక్కడో ఒకచోట వివాహ సంబంధాలకు సంబంధించిన గృహహింస, హత్యలు, నేరాలు వింటూనే ఉన్నాం. దానికి తోడు ఇటీవల వివాహేతర సంబంధాల కారణంగా జరుగుతున్న నేరాలు సమాజాన్ని దిగ్భ్రమకు గురి చేస్తున్నాయి. ఈ నేరాల వెనుక కారణాలు, నేపథ్యం ఏదైనా కావచ్చు, కానీ ఈ అత్యాధునిక సమాజంలో సామాజిక మాధ్యమాల పెనుతుపానులో ఇలాంటి నేరాల పట్ల వ్యక్తమవుతున్న అభిప్రాయాలు, తొందరపాటు వ్యాఖ్యానాలు మాత్రం ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశంలో పెరుగుతున్న 'వివాహేతర సంబంధాల' ప్రభావం, తదితర అంశాల గురించి చర్చించాల్సిన పరిస్థితి తలెత్తింది.**

వీక్షణం

# కలిసి నడిచే దారులన్నీ ముళ్ళబాటలేనా?





వివాహం అంటే కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య కుదిరే ఒప్పందం కాదు, అలాగని అది కేవలం ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయం కూడా కాదు. పిల్లలు, వివాహం అనే అంశాలు సమాజంతో, ఉమ్మడి శ్రేయస్సుతో ముడిపడి ఉంటాయి. పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనడం స్థూల దృష్టికి పూర్తిగా వ్యక్తిగత ఎంపికగా కనిపించినప్పటికీ, దాని అంతిమలక్ష్యం ఆరోగ్యవంతమైన సామాజిక మనుగడే! అనాది సంస్కృతులు, ఆచారాలు, భిన్నమతాలు, కులాలతో కూడిన సంక్లిష్టమైన భారతీయ సమాజంలో 'వివాహవ్యవస్థ'కు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. కుటుంబ వ్యవస్థకు మూలాధారం 'వివాహం'. కుటుంబ వ్యవస్థలోనే జీవిస్తూ, 'పెళ్ళి' దగ్గరికి వచ్చేటప్పటికి, దాన్ని వ్యక్తిగత ఎంపికగా మాత్రమే చూడడమన్నది దృష్టిలోపం. ప్రేమవివాహాలు తప్పు కావు. కానీ వివాహమనేది రెండు కుటుంబాలు, రెండు సమూహాల సామాజిక భద్రతకు సంబంధించిన అంశం. అందుకే 'పెళ్ళి'తో ముడిపడిన వారందరి అనుమతి తీసుకోవడం శ్రేయస్కరం. దీనికి సంమయనం అవసరం. నిజానికి పెళ్ళి అనేది మనిషికి 'సామాజిక బాధ్యత'ను నేర్పే మొట్టమొదటి పాఠశాల. ఇతరుల సంక్షేమం కోసం జీవించడాన్ని నేర్చుకోవడానికి మొదటి పాఠం కుటుంబం నుంచే మొదలవుతుంది. మనిషి పుట్టుకతో స్వార్థచింతనను కలిగి ఉంటాడు. దాన్ని అధిగమించి, సామాజిక లక్ష్యాల వైపు నడిపించడానికి ఈ కుటుంబ బాధ్యతలు తొలిపాఠాలుగా ఉంటాయి. కానీ దీన్నంతటినీ తప్పుగా అర్థం చేసుకుని, 'నేను, నా కుటుంబం' అనే సంకుచితమైన చట్రంలో మనిషి మళ్ళీమళ్ళీ ఇరుక్కుపోతున్నాడు. అది వేరే విషయం, ఇప్పుడు వివాహం గురించి ఆలోచిస్తే, వివాహంలోని 'ఉమ్మడి'భావన అంతరించి, ఇక్కడ కూడా స్వార్థచింతనే మొదటివరుసలో నిలబడడం బాధాకరం. 'వివాహం' కుటుంబ, సామాజిక జీవితానికి మొదటి మెట్టు. భారతీయ సామాజిక వ్యవస్థ 'పితృస్వామిక భావజాలం' మీద ఆధారపడి ఉంటోంది. ఈ సమాజంలో అనాదిగా స్త్రీల మీద జరుగుతున్న అత్యాచారాలు, 'వివాహబంధం' పేరిట వారి మీద అమలవుతోన్న అణచివేతలు, గృహహింస, అమానుష కృత్యాలు అందరికీ తెలిసిందే! కాగా ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటలను మాత్రమే ప్రాతిపదికగా చేసుకుని, భారతీయ వివాహ వ్యవస్థ కుప్పకూలిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వివాహం జీవితకాలపు సహవాసానికి, పరస్పర సహకారానికి, కుటుంబ బాధ్యతల నిర్వహణకు, మంచి సంతతిని కని, పెంచడానికి నిర్దేశితమైంది. సమాజం ఎంత సవ్యంగా ఉంటే, ఈ బాధ్యతలు, లక్ష్యాల సాధన కూడా అంతే సవ్యంగా ఉంటుంది. కానీ కేవలం పురుషులను, లేదా కేవలం మహిళలను తప్పుబట్టడమన్నది హ్రస్వదృష్టికి సంకేతం. వివాహబంధం మనిషికి సంయమనాన్ని నేర్పే మానసిక ఉపకరణం. ఈ బంధం కేవలం శారీరకం కాదు, ఇది మానసిక పరిపక్వతను సాధించడానికి అందరికీ అందుబాటులో ఉన్న మహదావకాశం. ఇప్పటికిప్పుడు ఈ 'పెళ్ళి'కి వచ్చిన ఆపదేమిటి? దేశంలో ఇటీవలి కాలంలో సౌరభ్ గులాటి (2018), అభిషేక్ పాఠక్ (2019), వికాస్ వాల్మీకి (2020), సిద్ధార్థ్ గుప్తా (2021), సంజయ్ సింగ్ (2022), అంకిత్ బన్సాల్ (2023), తాజాగా రాజా రఘువంశీ (2025)ల హత్యలు జరిగాయి. ఆ హత్యలన్నీ భార్యలే చేశారని అంటున్నారు. నిజానిజాల సంగతి పక్కనబెడితే, శతాబ్దాలుగా ఈ దేశం మహిళల మీద జరిగిన వందలాది, వేలాది వరకట్నపు చావుల్ని చూసింది, కోర్టుల్లో గృహహింస కేసులు పెరుగుతూనే ఉన్నాయి. మరి వీటి మాటేమిటి? ఒక నేరం వెనుక మనిషిలోని భయం మానసికంగా ప్రధాన కారణంగా ఉంటుంది. మనిషిలోని స్వార్థం భయంగా మారుతుంది, భయం ద్వేషంగా మారుతుంది, ద్వేషం పగగా, ప్రతీకారంగా స్థిరపడుతుంది. ఇలాంటి ప్రతికూల మానసిక ధోరణులు నేరాలకు పురిగొల్పుతాయి. కుటుంబ వ్యవస్థ 'సొంత ఆస్తి', 'ధనార్జన' వంటి రుగ్మతలకు దూరమైతే తప్ప, అది ఒక పరిపూర్ణమైన సామాజిక వ్యవస్థగా రూపొందదు. అలా అది పరిపూర్ణతను సంతరించుకోనంత కాలం, దానికి సంబంధించిన ప్రతి వ్యవస్థ ఇలాంటి లోపాలతో కునారిల్లుతుంటుంది.

## సామాజిక జీవనానికి తొలిపాదు కుటుంబం

తల్లిదండ్రులు పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగినప్పుడే మంచి కుటుంబం రూపుదిద్దుకుంటుంది. భార్యను కట్నకానుకలు తెచ్చే యంత్రంగాను, ఇంటి పనులు చేసే బానిసగాను, తమ వంశం పేరు నిలిపేందుకు పిల్లల్ని కనే యంత్రంగాను చూసినప్పుడు భర్త తన బాధ్యతా నిర్వహణలో విఫలమవుతాడు. అలాగే భర్తను ఆర్థిక వనరుగాను, మానసికోల్లాసానికి పనికి వచ్చే ఉపకరణంగాను భార్య చూసినప్పుడు ఆమె భార్యగా తన బాధ్యతల నిర్వహణలో విఫలమవుతుంది. నేరాలకు పాల్పడే వ్యక్తులు ఆడవాళ్ళయినా, మగవాళ్ళయినా, ధనవంతుడైనా, పేదవాడైనా, అధికారి అయినా, పనివాడైనా..., ఎవరైనా సరే, వీళ్ళను నేరం వైపు పురిగొల్పే మానసిక స్థితికి మూలాలు వ్యక్తి స్వార్థంలోను, భయంలోను దాగి ఉంటాయి. తమలోని స్వార్థాన్ని జయించిన తల్లిదండ్రులే తమ పిల్లల్ని ఈ దుర్లక్షణం నుంచి కాపాడుకోగలరు. మనుషులు పుట్టుకతో నేరగాళ్ళు కారు. సమాజమే వారిని నేరస్తులుగా మార్చుతుంది. హక్కులు మాత్రమే గుర్తుండి, బాధ్యతలతో నిమిత్తం లేని ఆలోచనా ధోరణి మిమ్మల్ని ఏ పొలిమేరల వైపు నడిపిస్తోందో అర్థం చేసుకున్నారా? ప్రస్తుతం దేశంలో ఆడపిల్లలు తమ ప్రియుళ్ళ కోసం భర్తల్ని చంపేస్తున్నారంటూ ఆక్రోశిస్తున్న 'అనధికార వ్యవస్థా రక్షకులారా', అసలు ఆ పెళ్ళిళ్ళు జరగకుండా ఉంటే, ఆ హత్యలు జరిగేవా? ఆ పెళ్ళిళ్ళ వెనుక తల్లిదండ్రుల కుల, మత, ఆర్థికపరమైన స్వార్థకోణం లేదా, కట్నాల కోసం పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు, ప్రేమ పెళ్ళిళ్లలో కూడా ఆడంబరాలు, ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారు. మనుషులుగా మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని సమకూర్చుకోకుండా వ్యవస్థ ఇచ్చే ఫలాల్ని అందుకుంటున్నాం. సమాజం ఇచ్చే అన్ని సౌకర్యాల్ని అనుభవిస్తూ, అందుకోసం చెల్లించాల్సిన మూల్యాన్ని మాత్రం చెల్లించక పోవడం శోచనీయం.సామాజిక శ్రేయస్సు కేవలం స్త్రీల సహనంలోనో, శారీరకపరమైన 'శీలం'లోనో, పురుషుల సంపాదనా శక్తి మీదనో, కండబలం మీదనో ఆధారపడి లేదు. అది ప్రతిఒక్కరి మానసిక పరిపక్వత మీద ఆధారపడి ఉంటుంది.

**- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)**

**పిల్లల్ని స్వేచ్ఛగా ఎదగనివ్వండి, ప్రేమ, త్యాగాల్లోని గొప్పదనాన్ని మీ జీవనవిధానం ద్వారా వారికి అర్థం చేయించండి. మనిషి ఎలాంటి సవాళ్ళనైనా గెలవడానికి సంయమనం అనే సాధనం కావాలి. ఆ సంయమనమే పెనుతుఫానులో కూడా మిమ్మల్ని చెక్కుచెదరనివ్వకుండా కాపాడగలదు. సంయమనం, సహనం అనేవి ఎదుటివారి ప్రయోజనం కోసం ఉద్దేశితమైనవి కావు, అవి మీ సంక్షేమం కోసం మాత్రమే ఉద్దేశితమైనవి.**

**మీరు కోరుకున్న చదువే చదవాలని, మీరు చెప్పిన వారినే పెళ్ళి చేసుకోవాలని, మీరు అనుసరించిన సూత్రాలనే అనుసరించి తీరాలని పిల్లల్ని బలవంతం చేయడంలో మీ స్వార్థం దాగి ఉంది. అలా బలవంతం చేసినపుడు తలెత్తే దుష్పరిణామాలకు పిల్లలు తమ జీవితాల్ని కోల్పోవలసి వస్తోంది. మనుషులు పుట్టుకతో నేరగాళ్ళు కారు. సమాజమే వారిని నేరస్తులుగా మార్చుతుంది. సంయమనం, సహనం, ప్రేమ, త్యాగం లాంటి సానుకూల గుణాల్ని మీ పిల్లల్లో నింపండి.**

**భార్యాభర్తల సంబంధం 'ఇచ్చి, పుచ్చుకోవడం'లోనే పరిపక్వతను సాధిస్తుంది. ఏ సంబంధమైనా మనం ఎదుటివారి కోసం కొంతైనా వదులుకోవడానికి సిద్ధపడినప్పుడే ఆ సంబంధానికి న్యాయం చేసిన వాళ్ళమవుతాము. అలా కాకుండా 'ఎదుటి వాడి వల్ల నాకేం ఒరిగింది?' అన్న ప్రశ్నకు మనిషి పరిమితమైనప్పుడు, ఆ సంకుచిత మనస్తత్వం ఆ మనిషిని చిత్రవధకు గురిచేస్తుంది.**





కిటికీ

## మనమేమీ తక్కువ కాదు!

'వివాహేతర సంబంధం' - ఇది నమ్మకద్రోహానికి పర్యాయ పదమనే భావించాలి. కృత్రిమ మేధస్సు మన జీవితాల్ని నిలువునా అల్లుకుంటున్న ఈ ఆధునిక కాలంలో 'ఎఐ చాట్‌బోట్స్' వంటి అనేకానేక శక్తివంతమైన సామాజిక వేదికలు, మాధ్యమాల్ని చురుకుగా వాడుకుంటున్నందు వల్ల నమ్మద్రోహం అనే భావన అనేకానేక కోణాల్ని సంతరించుకుంటోంది. వీటన్నింటిలో వైవాహిక సంబంధాలకు సంబంధించిన కోణం మాత్రం కాస్త ఆందోళనకరంగానే ఉంది. ఒక్కరితోనే జీవితాంతం కలిసి నడిచే వైవాహిక బంధాన్ని ఆధునిక సమాజం ఇష్టపడడం లేదు.

ఒకానొక అంతర్జాతీయ అధ్యయనం ఈ వివాహేతర సంబంధాల గురించి ఆశ్చర్యకరమైన అంశాల్ని వెలుగులోకి తెచ్చింది. కెనడా-ఫ్రాన్స్‌కు చెందిన డేటింగ్ యాప్ 'యాష్లే మాడిసన్', 'యుజీవొవి' ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన ఒక ప్రపంచ సర్వేలో, వివాహేతర సంబంధాల్లో రెండు దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయని తేలింది. సర్వే చేసిన ఈ రెండు దేశాల్లోనూ 53 శాతం మంది వయోజనులు తమకు వివాహేతర సంబంధం ఉందని ఒప్పుకున్నారు. ఈ రెండు దేశాల్లో అమెరికా, ఫ్రాన్స్ వంటి పాశ్చాత్యదేశాలు లేవు. ఆ రెండు దేశాలు ఏవంటే ఒకటి భారతదేశం, మరొకటి బ్రెజిల్! ప్రముఖ డేటింగ్ యాప్ ఆష్లే మాడిసన్, అంతర్జాతీయ ఆన్‌లైన్ పరిశోధన డేటా- విశ్లేషణల సాంకేతిక సంస్థ 'యుజీవొవి' కలిసి ఫిబ్రవరి 24 నుంచి మార్చి 6, 2025 మధ్య బహుళ దేశాలలో 13,508 మంది వయోజనులతో సర్వే నిర్వహించాయి, అందులో 4,517 మంది వ్యక్తులు తమకు వివాహేతర సంబంధాలు ఉన్నట్టు అంగీకరించారు. ఈ పరిశోధన ఫలితాలు భారత్, బ్రెజిల్‌లలో అత్యధికంగా వివాహేతర సంబంధాలు ఉన్నట్లు వెల్లడించాయి, సర్వే చేసిన ప్రతి దేశం నుంచి 53 శాతం మంది వయోజనులు తమ వివాహేతర సంబంధాల గురించి ఒప్పుకున్నారు. ఈ అధ్యయనం లైంగిక అంశాలు, ఉద్యోగాలు, జనాభా, ఇతర విషయాలకు సంబంధించిన వివిధ అంశాలను మరింతగా పరిశీలించింది.

సర్వేలో పాల్గొన్న దాదాపు 56 శాతం మంది భారతీయులు తమ వివాహం లేదా వివాహేతర సంబంధం కంటే తమ ఉద్యోగాలతోనే తాము సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. మూడింట ఒక వంతు (ఇది దాదాపు 33 శాతం) తమ వివాహం/సంబంధంలో సంతోషంగా ఉన్నామని నమ్ముతున్నారు, వీరిలో 25 శాతం మంది మహిళలు తమ వివాహం/సంబంధం సంతృప్తికరంగా లేకపోయినప్పటికీ, సహించదగినదిగా ఉన్నట్టు భావిస్తున్నారు. అయితే 49 శాతం మంది పురుషులు తాము కుటుంబంతో సంతృప్తిగానే ఉన్నామన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదనంగా, యాప్ సభ్యులలో దాదాపు 35 శాతం మంది తమ ప్రేమ వ్యవహారాలు సాధారణంగా ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం కొనసాగుతాయని అంగీకరించారు (పురుషులలో 34 శాతం మందితో పోలిస్తే మహిళల్లో 56 శాతం). వివాహేతర సంబంధాలకు సంబంధించి ప్రత్యేకంగా 2020లో 'గ్లీడెన్' నిర్వహించిన సర్వేలో, ఆ సంవత్సరం దాదాపు 1.35 లక్షల మంది బెంగళూరు వాసులు ఈ సైట్లో నమోదు చేసుకున్నారని వెల్లడైంది- ఇది ఏ భారతీయ నగరానికైనా అత్యధికం, తద్వారా వివాహేతర సంబంధాల్లో దీనిని దేశానికి 'అవిశ్వాస రాజధాని'గా (ఆ సమయంలో) ఆ సర్వే గుర్తించింది. సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో దాదాపు 91,800 పురుషులు, 43,200 మంది మహిళలు ఉన్నారు.



**- కల్కి**

# ముందే మేల్కొనండి!

లైంగికపరమైన, భావోద్వేగపరమైన వ్యవహారాలు జీవితానికి చాలా హాని కలిగిస్తాయి. సుమారు 46% పురుషులు, 23% స్త్రీలు తమ వివాహ జీవితంలో వివాహేతర సంబంధాల్ని కలిగి ఉంటారని ఒక అంతర్జాతీయ అధ్యయనం చెబుతోంది. ఈ సంబంధాలు వివాహాన్ని, కుటుంబాన్ని నాశనం చేయవచ్చు. దాచి పెట్టిన వ్యవహారం వెలుగు చూసిన తరువాత, దాన్నుంచి బయటపడినప్పటికీ, వైవాహిక సంబంధంలో మునుపటి పరిస్థితిని తీసుకురావడం కాసింత కష్టసాధ్యం, చాలా సమయం కూడా పడుతుంది. కొన్నిసార్లు అసాధ్యం కావచ్చు. అందుకే వివాహేతర సంబంధాల్లోకి అడుగు పెట్టే ముందు, ఆ వ్యక్తి తన కుటుంబం, భవిష్యత్తు గురించి ఆలోచించాలి. వివాహేతర సంబంధం అంటే నమ్మకద్రోహమే! ఇది కొన్ని ప్రమాద సంకేతాలతో కూడి ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. వివాహమనే సరిహద్దురేఖను దాటి ప్రవర్తించడానికి ముందు వ్యక్తిలో కొన్ని లక్షణాలు తలెత్తుతాయి. వీటిని ఎవరికి వారు ప్రశ్నించుకుంటే, విశ్లేషించుకుంటే, ప్రమాదాన్ని కాసింతైనా నివారించవచ్చు.

1. **భావోద్వేగ సాన్నిహిత్యం:** మీరు లైంగికంగా ఆకర్షితులైన వ్యక్తితో లోతైన ఆలోచనలు, భావనలు పంచుకుంటున్నారా? మీ వైవాహిక సమస్యలను వారితో చర్చిస్తున్నారా? ఈ సంభాషణల్ని మీ భాగస్వామి వినడానికి ఇష్టపడరా?

2. **లైంగిక ఆకర్షణ:** మరొక వ్యక్తి పట్ల లైంగికంగా ఆకర్షితులై, వారితో శృంగారాన్ని కోరుకుంటూ, ఊహల్లో తేలిపోతున్నారా?

3. **రహస్యం:** మీరు ఆకర్షితులైన వ్యక్తితో గడిపిన సమయాన్ని కుటుంబ సభ్యులకు తెలియకుండా దాచిపెడుతున్నారా? ఈ వ్యక్తి గురించి మీ భాగస్వామికి అబద్ధం చెబుతున్నారా?

ఇవన్నీ మిమ్మల్ని తప్పుడు దారిలోకి నెట్టే సంకేతాలే, వీటి విస్మరించకండి. మీరు వ్యక్తిగతంగాను, మానసికంగాను నిజాయితీగా ఉండండి. మీ జీవితభాగస్వామితో నిజాయితీగా వ్యవహరించండి. సంతోషం కరవైన వివాహాల్లో మాత్రమే ఇలాంటి వ్యవహారాలు జరుగుతాయని చాలామంది భావిస్తారు. కానీ, సంతోషకరమైన వివాహాల్లో కూడా కొందరు వివాహేతర సంబంధాల పట్ల ఆకర్షితులవుతారు. మీ వివాహ బంధాన్ని రక్షించుకోవడానికి కొన్ని చిట్కాలు సహాయపడతాయి, ఇవి వినడానికి, చదవడానికి కాస్త అసహజంగా అనిపించినా, ఆచరణలో పెడితే, సత్ఫలితాలు దక్కుతాయి.



మీది పెద్దలు కుదిర్చిన వివాహమైతే, వివాహ సమయంలో మీరు, మీ జీవిత భాగస్వామి కలిసి చేసిన వాగ్దానాల్ని గుర్తుకు తెచ్చుకోండి. మీది ప్రేమ వివాహమైతే మీరిద్దరూ ఒకరికొకరు 'మాటిచ్చుకున్న' సంగతుల్ని గుర్తుకు తెచ్చుకోండి. మీ జీవిత భాగస్వామి ఈ వాగ్దానాల విషయంలో పాటిస్తున్న నిబద్ధతను గుర్తించండి. నమ్మకమన్నది ఒక ఎంపిక, దానిని మీరిద్దరూ పాటించాలని నిర్ణయించుకోండి.

చాలా మటుకు వివాహేతర సంబంధాలు వ్యవహారాలు పనిచేసే చోటు నుంచి మొదలవుతుంటాయి. కాబట్టి ముందుజాగ్రత్తగా మీరు ఆకర్షితులవుతున్నామని భావించే వ్యక్తితో ఒంటరిగా సమయం గడపవద్దు. సమూహాలతో కలిసి పనిచేయండి. వేడుక సమయాల్లో మద్యం స్వీకరించే విషయంలో జాగ్రత్త వహించండి. వివాహ సమస్యలను సహోద్యోగులతో కాక, సంబంధిత నిపుణులతో లేదా ఫ్యామిలీకౌన్సిలర్లతో చర్చించండి. 'నా జీవిత భాగస్వామి ఇక్కడ ఉంటే, ఇలా చేస్తానా?' అని మిమ్మల్ని ప్రశ్నించుకోండి. ఆ ప్రశ్నకు తగిన జవాబు మీ నుంచి మీకు లభించకపోతే, మీరు ప్రమాదానికి బాగా దగ్గర్లో ఉన్నట్టే!

**ఇంటర్నెట్:** ఆన్‌లైన్ సంబంధాలు వివాహబంధానికి హాని కలిగిస్తాయి. ఇమెయిల్, చాట్‌రూమ్‌ల ద్వారా భావోద్వేగ వ్యవహారాలు ప్రాణం పోసుకుంటాయి. మీరు మహిళ అయితే పురుషులతోను, మీరు పురుషుడైతే మహిళలతోను సన్నిహిత సంభాషణలు జరపడం, వైవాహిక సమస్యలను చర్చించడం, మీ సంభాషణల్ని రహస్యంగా ఉంచడం వంటివి భావోద్వేగపరంగా మీరు లక్ష్మణరేఖ దాటుతున్నారనడానికి సంకేతాలు. అందుకే మీరు పనిచేసే కంప్యూటర్, లాప్‌టాప్‌ల వంటి ఉపకరణాల్ని ఇంట్లో అందరూ తిరిగే ప్రదేశంలో ఉంచి, పనిచేసుకోండి, చాట్‌రూమ్‌లను వాడవద్దు.

మీరు వివాహేతర సంబంధం పట్ల ఆకర్షితులవుతున్నారా? మీ భాగస్వామిపై కోపం, అసూయ వంటివి కలుగుతున్నాయా లేదా తనతో అసలు సంబంధమే లేనట్టు అనిపిస్తుందా? ఇలాంటి ఆలోచనలు, ఉద్వేగాలు మిమ్మల్ని వివాహేతర సంబంధం వైపు నడిపిస్తాయి. మీ ఆందోళనలను భాగస్వామితో చర్చించండి లేదా కౌన్సెలర్‌ను కలవండి.

'వివాహం తర్వాత పరాయి వ్యక్తి పట్ల ఆకర్షణే కలుగదు' అనే ఆలోచన సరైనది కాదు. సంతోషకరమైన వివాహాల్లో కూడా ఇతరుల పట్ల ఆకర్షణ కలుగవచ్చు. దీనిని భాగస్వామితో ఎలాంటి దాపరికాలు లేకుండా చర్చించడం ద్వారా, మీరు మీ సరిహద్దులను గుర్తు చేసుకోవచ్చు. చర్చించకపోతే, అది 'రహస్యం'గా మారి, వివాహేతర సంబంధానికి దారితీస్తుంది.

అనుక్షణం కాలంతో పోటీ పడి పని చేయాల్సిన వేగవంతమైన జీవన సరళిలో మనందరం జీవిస్తున్నాం. ఉద్యోగాలు, కెరీర్, పిల్లల పోషణ, ఇంకా ఇలాంటి విషయాలెన్నో ఊపిరి సలపనివ్వవు. కానీ ఈ ప్రవాహంలో పడి, వైవాహిక సంబంధంలోని మాధుర్యాన్ని వదులుకోకండి. ప్రతిరోజూ భాగస్వామితో మానసికంగా దగ్గరవడానికి సమయాన్ని కేటాయించండి. ఉదయం కాఫీ, సాయంత్రం చాట్, వారంలో లంచ్ డేట్, లేదా డిన్నర్ తర్వాత నడక, ఇలా రోజూ 15-20 నిమిషాలు కలిసి గడపడం వివాహబంధాన్ని బలంగా ఉంచుతుంది.

వైవాహిక జీవితంలోని గొప్పదనం గురించి చదువుకోవడం, ఆన్‌లైన్ మాధ్యమాల్లో వినడం, చూడడం కాదు..., మీ సొంత జీవితాల్లో దాని గొప్పప్రభావాన్ని అనుక్షణం అనుభవించండి. మీ జీవిత భాగస్వామిని తోడుగా పొందడంలోని మాధుర్యాన్ని గమనించండి, ఆ మాధుర్యానికి కృతజ్ఞతలు చెప్పండి. కలిసి సరదాగా గడపడం, నవ్వడం సంబంధాన్ని బలపరుస్తుంది. మీరు ఆనందించే కార్యకలాపాల జాబితా రాయండి. నెలకు కనీసం రెండుసార్లు వాటి కోసం సమయాన్ని కేటాయించండి. మీ సంపాదనను అనుసరించి ఇలాంటి సరదాల్ని కుటుంబంతో కలిసి పంచుకోండి.

**- తులసీవెంకట్**

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.